## రోడ్డు భద్రతపై పోలీసుల వినూత్న ప్రచారం






## పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి






# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 65 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 03 మార్చి 2026


## ఇరాన్‌పై యుద్ధం నాలుగు వారాలు ఉండొచ్చు: డొనాల్డ్ ట్రంప్



**హైదరాబాద్ మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇరాన్‌పై సైనిక చర్యకు నాలుగు వారాలు ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. బ్రిటిష్ వార్తాపత్రిక డైలీ మెయిల్‌తో ట్రంప్ మాట్లాడుతూ "ఇరాన్ ఒక పెద్ద దేశం కాబట్టి ఇది నాలుగు వారాలు లేదా అంతకంటే తక్కువ సమయం మిగతా2లో...

## దాడిలో గాయపడ్డ ఖమేని భార్య మృతి

- ఇరాన్ అధికారిక వార్తా సంస్థ వెల్లడి



**టెహ్రాన్, 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ గత శనివారంనాడు తొలిసారి టెహ్రాన్‌పై జరిపిన దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ భార్య మన్సూరే ఖోజాస్తే సోమవారంనాడు మరణించినట్టు ఆదేశ అధికారిక వార్తా సంస్థ మిగతా2లో...

## పశ్చిమాసియా ఘటనలతో
# ఉద్రిక్తత

### అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడికి మోడీ ఫోన్



**న్యూఢిల్లీ,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సైనిక చర్య, ఇందుకు ప్రతిగా ఇరాన్ జరుపుతున్న దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణలు, డ్రోన్ దాడులపై విరుచుకుపడుతుండటం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్, బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారంనాడు ఫోను చేశారు. ఇరువురు నేతలతో సంభాషణల్లో సౌదీ అరేబియా, బహ్రెయిన్‌పై ఇరాన్ జరుపుతున్న దాడులను మోదీ ఖండించారు. రెండు దేశాల్లోని భారతీయుల భద్రతపై ఆరా తీశారు. కాగా, దీనికి ముందు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో మోదీ ఫోనులో మిగతా2లో...



## రాహుల్‌ను ప్రధాని చేయడమే
# మన కర్తవ్యం

**వికారాబాద్,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం మనమంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోడీ వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రాషహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమమని అన్నారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి మిగతా2లో...

**అందుకోసం కలసికట్టుగా పనిచేద్దాం**

**రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమం**

**డిసిసి అధ్యక్షులు శిక్షణ శిబిరం ముగింపులో సిఎం రేవంత్**

## జల్లికట్టులో తీవ్ర విషాదం

-ఎద్దు పొడవడంతో ముగ్గురు దుర్మరణం



**చెన్నై,02 (పిసిడబ్ల్యూ న్యూస్):** శివగంగై జిల్లాలో ఏర్పాటు చేసిన జల్లికట్టులో తీవ్ర విషాదం నెలకొంది. సోమవారం జరిగిన ఈ క్రీడలో ఎద్దు పొడవడంతో ముగ్గురు మరణించారు. మరో 50 మందికిపైగా గాయపడ్డారు. స్థాని కుల సహాయంతో వారందరినీ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి మిగతా2లో...

## బాన్సువాడ ఘటన దురదృష్టకరం

- హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు
- ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చి రోడ్డున పడేశారు
- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు



**కామారెడ్డి,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరం కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని చెప్పారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. పెద్దలతో బేరసారాలు కుదుర్చుకుని వారి జోలికి వెళ్లడం లేదన్నారు. మిగతా2లో...

## దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

- క్షేమంగానే ఉన్నట్లు సమాచారం అందచేత



**హైదరాబాద్,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధ జరుగుతోంది. పశ్చిమ ఆసియా దేశాల్లోనెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని మూసేశాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. గత ఐదు రోజుల క్రితం ఆయన దుబాయ్ వెళ్లారు. మంత్రి కుటుంబ సభ్యులలో ఒకరికి అకస్మాత్తుగా అనారోగ్యం కలగడంతో, మెరుగైన చికిత్స అందించడం కోసం ఆయన మిగతా2లో...



## సూర్యాపేట జిల్లా మైనింగ్‌లో అక్రమాలు

- ఇ-వేలంలో భారీగా అక్రమాలు
- వెంటనే మైనింగ్ ప్రక్రియ ఆపాలి
- సిఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సూర్యాపేట జిల్లాలో మైనింగ్ ఈ–వేలంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని స్వతంత్ర విచారణ చేసి టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 1,100 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్‌పై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని ఆరోపించారు. కీలక సాంకేతిక వివరాల్లో లోపం, లాటిట్యూడ్, లాంగిట్యూడ్, డీజీపీఎస్ సర్వే వివరాలు వెల్లడించలేదని విమర్శించారు. జియోలాజికల్ నివేదికలు సైతం లేవని ఆరోపించారు. మినరల్ ఆక్షన్ రూల్స్–2015 ఉల్లంఘన జరిగిందని హైకోర్టు సూచనలు పట్టించుకోలేదన్నారు. పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్ల ప్రకటన,కంపెనీల ఎంపికపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు. మైనింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కేసులు ఎదుర్కొంటున్న డెక్కన్ సిమెంట్స్, ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్‌కు బ్లాక్‌ల కేటాయింపుపై సందేహాలున్నాయని తెలిపారు. టెండర్ రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అన్ని అనుమతుల తర్వాతే పారదర్శకంగా కొత్త వేలం నిర్వహించాలని సూచించారు. గనుల శాఖ చేపట్టిన ఈ వేలం ప్రక్రియ పారదర్శకతకు విరుద్ధంగా సాగిందని ఆయన విమర్శించారు. మిగతా2లో...

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..

- తెలంగాణవాసులకు హెల్ప్ లైన్




**న్యూఢిల్లీ,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ పౌరులకు సహాయం అందించేందుకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మిగతా2లో...

## నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

- ఆకాశంలో కనిపించనున్న బ్లడ్‌మూన్



**హైదరాబాద్,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంగళవారం రాత్రి ఆకాశంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. సంపూర్ణ చంద్రగ్రహణంతో ఈ అవకాశం దక్కనుంది. ప్రపంచవ్యాప్తంగా 'బ్లడ్‌మూన్' కనువిందు చేయనుంది. మంగలశారం మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో బ్లడ్‌మూన్ దశ ప్రారంభం కానుంది. అయితే, మిగతా2లో...

PCW తెలుగు దినపత్రిక



# పశ్చిమాసియా ఘటనలతో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేశారు. పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఘర్షణలను సాధ్యమైనంత త్వరగా ముగించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. ఆదివారం రాత్రి భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీకి కూడా మోదీ అధ్యక్షత వహించారు. పశ్చిమాసియాలో ఘర్షణల వల్ల తలెత్తిన పరిణామాల, ఆయా దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయుల భద్రతపై సమావేశంలో చర్చించారు. సంభాషణకు సంబంధించి ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా కీలక విషయాలను పంచుకున్నారు. యూఏఈ అధ్యక్షుడిని తన 'సోదరుడు' అని సంబోధిస్తూ, అక్కడ జరిగిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముఖ్యంగా యూఏఈలో నివసిస్తున్న భారతీయ సమాజం భద్రత పట్ల ఆ దేశం చూపుతున్న శ్రద్ధకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్రిక్తతలను తగ్గించి, శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించడానికి భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు, ప్రధాని మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ అత్యవసరంగా భేటీ అయ్యింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల వల్ల ప్రపంచవ్యాప్తంగా తలెత్తే రాజకీయ మరియు ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన వ్యూహాత్మక నిర్ణయాలపై ఈ కమిటీ కసరత్తు చేసింది. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఎస్. జైశంకర్ మరియు నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. దేశ భద్రతకు సంబంధించి అత్యున్నత నిర్ణయాలు తీసుకునే ఈ కమిటీ, ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ అనుసరించాల్సిన విదేశాంగ విధానం మరియు అంతర్జాతీయ వేదికలపై వినిపించాల్సిన స్వరంపై స్పష్టతనిచ్చింది. యుద్ధం వల్ల భారత ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని కనిష్ఠం చేసేలా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది.

# బాన్సువాడ ఘటన దురదృష్టకరం

(మొదటి పేజీ తరువాయి)

మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలోని భూదాన్ భూముల్లో పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లో ఎన్ని ఇళ్లున్నాయి? ఎన్ని కూల్చారు? అనే దానిపై చర్చకు సిద్ధమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఏఐసీసీ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన పర్యటన పాకెట్ మనీ కోసమేనా అని ప్రశ్నించారు. గాంధీ కుటుంబానికి కాంగ్రెస్ రూ.10 వేలకోట్లు ఇవ్వ గలదని సీఎం రేవంత్ రెడ్డే చెప్పారన్నారు. ఒక్క తెలంగాణ నుంచే వెయ్యి కోట్లు గాంధీ కుంబానికి వెళ్తాయని ఆరోపించారు. కామారెడ్డి బాన్సువాడలో జరిగిన కలహాలలో జైలుకి పోయిన బాధితుల కుటుంబ సభ్యులను బండి సంజయ్ పరామర్శించారు. ముఖ్యమంత్రి బలిసినోడిని వదిలి పెట్టి నిరుపేదల జోలికి పోతున్నారు. రాహుల్ గాంధీ చేస్తున్నది రాజకీయ పర్యటనా? లేక కలెక్షన్ల సమీక్షనా? అని రాష్ట్రం చూస్తుందని అన్నారు. హైదరాబాద్ లో ఫాతిమా కళాశాలను వదిలి పెట్టి ఖమ్మంలో కళాశాలలను కూల్చిన గొప్పతనం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది. రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల జోలికి వస్తే అదే బోల్డోజర్లు తీసుకుని నీపైకి వస్తాం. గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయక పోయినా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మనం తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్లనే మనం ఈ గోస పడుతున్నాం. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మనం ఆలోచించి ఓటు వేయాలి. కామారెడ్డిలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డిపై దాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ దాడులు చేస్తే మేము సహించి ఊరుకోవడానికి బిఆర్ఎస్ నాయకులం కాదు. దేశంలో 20 రాష్ట్రాల్లో మేము అధికారంలో ఉన్నాం.

# రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు. తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇచ్చిన నేతగా సోనియా పేరు చిరస్థాయిగా ఉంటుందని అన్నారు. త్యాగాలు చేసిన కుటుంబం వారిదని అన్నారు.

# నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

(మొదటి పేజీ తరువాయి)

దీని ప్రభావం మాత్రం 4.34 గంటల నుంచి మొదలవ్వనుంది. ఇండియాలోని చాలా రాష్ట్రాల్లో బ్లడ్‌మూన్‌ను చూడాలంటే సూర్యాస్తమయం వరకు వేచి చూడాల్సిందే. ఇక, తెలుగు రాష్ట్రాల్లో కూడా సాయంత్రం 6 గంటల తర్వాతే బ్లడ్‌మూన్ ఉంటుంది. గ్రహణం ముగిసే చివరి ఘట్టాన్ని వీక్షించే అవకాశం కూడా తెలుగు రాష్ట్రాలకు ఉండనుంది. భూమి నీడ చంద్రునిపై పూర్తిగా పడినప్పుడు సంపూర్ణ చందగ్రహణం ఏర్పడుతుంది. భూ వాతావరణం సూర్యకాంతిని వక్రీకరించి, కేవలం ఎరుపు రంగు కిరణాలను మాత్రమే చంద్రునిపైకి ప్రసరింపజేస్తుంది. దీని వల్ల చంద్రుడు ఎరుపు రంగులో మెరుస్తూ కనిపిస్తాడు. చంద్రుడు ఎరుపు రంగులో కనిపిస్తాడు కాబట్టి.. దాన్ని 'బ్లడ్‌మూన్' అని పిలుస్తారు. చంద్రునిపై భూమి నీడ దాదాపు ఒక గంట రెండు నిమిషాల పాటు పడనుంది. అయితే, ఇండియాలోని ప్రజలు బ్లడ్‌మూన్‌ను కొంత సమయం పాటు మాత్రమే చూసే అవకాశం ఉంటుంది. దేశంలోని చాలా నగరాల్లో 7 నుంచి 25 నిమిషాల పాటు బ్లడ్‌మూన్‌ను వీక్షించే అవకాశం ఉంటుంది. దేశ రాజధాని ఢిల్లీ ప్రజలకు దాదాపు 20 నిమిషాలకుపైగా సమయం వరకు గ్రహణాన్ని వీక్షించనున్నారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించడానికి భారతదేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతాలు అత్యంత అనుకూలమైనవి. ఈ ప్రాంతాల్లో త్వరగా చంద్రోదయం అవుతుంది కాబట్టి గ్రహణం ఎక్కువ సేపు ఉంటుంది. ఇటానగర్,గువహటి, సిలిగురి, కోల్‌కతా వంటి నగరాల్లో గ్రహణం అత్యంత స్పష్టంగా, ఎక్కువ సమయం పాటు కనిపిస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు.

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..

(మొదటి పేజీ తరువాయి)

ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మధ్యప్రాచ్యం ప్రాంతంలో ఏర్పడుతున్న పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం సమగ్రంగా పర్యవేక్షిస్తోంది. తెలంగాణ భవన్‌లోని సీనియర్ అధికారులు.. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదుల దృష్ట్యా.. తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు 24ః7 కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది. ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు, తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఏవైనా ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు. మధ్యప్రాచ్యం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# సూర్యాపేట జిల్లా మైనింగ్‌లో అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)



టెండర్ నోటీసు జారీకి ముందే మినరల్ బ్లాక్‌లను ఖచ్చితంగా గుర్తించి పూర్తి వివరాలు వెల్లడించడం తప్పనిసరి అయినప్పటికీ, ఈ నిబంధనలు పాటించలేదని విమర్శించారు. ఈ అక్రమ టెండర్లపై మరింత ఆందోళన కలిగించే అంశాలను కూడా ఆయన లేఖలో ప్రస్తావించారు. న్యాయపరమైన విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వేలాన్ని ముందుకు తీసుకెళ్లడం, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సూచనలను పట్టించుకోకపోవడం, చట్టపరమైన , పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడం వంటి అంశాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. మైన్స్ అండ్ జియోలజీ శాఖ లీగల్ ఆఫీసర్ ఈ బ్లాక్‌ల సమాచారాన్ని గోప్యంగా పేర్కొంటూ ఫిర్యాదుదారునికి ఇవ్వడానికి నిరాకరించడం పారదర్శకతపై అనుమానాలు పెంచుతోందని అన్నారు. ప్రస్తుత వేలం ప్రక్రియకు సంబంధించిన అన్ని చర్యలను తక్షణమే నిలిపివేయాలని, టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర , పారదర్శక విచారణను నిర్ణీత కాలపరిమితి లో పూర్తి చేయాలని, అవసరమైన శాస్త్రీయ సర్వేలు, జియోలాజికల్ డేటా వెల్లడి, అటవీ అనుమతులు పొందిన తర్వాత మాత్రమే చట్టబద్ధంగా కొత్త టెండర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని కేటీఆర్ కోరారు. ఈ లేఖ ప్రతులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా పంపారు.

# ప్రజలకు గవర్నర్, సిఎం హోళీ శుభాకాంక్షలు



**హైదరాబాద్,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హోళీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి పండుగగా హోళీని ఆనందోత్సా హాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రేమ, ఆప్యాయత సంతోషాల హరివిల్లుగా, శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే పండుగ హోళీ అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సహజ సిద్ధమైన రంగులు, సాంప్రదాయ పద్ధతులతో పండుగను జరుపు కోవాలన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజల సమైక్యతను చాటే పండుగ హోళీని వేడుకగా జరుపుకోవాలని అన్నారు. అలాగ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగ ప్రజల్లో రంగులు నింపాలని కోరుకున్నారు.

# ఇరాన్‌పై యుద్ధం నాలుగు వారాలు ఉండొచ్చు: డొనాల్డ్ ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

పడుతుంది" అని అన్నారు. ఇంతలో, అవసరమైతే తమ ప్రయోజనాలను మరియు గల్ఫ్ మిత్రదేశాల ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఇరాన్‌పై "రక్షణాత్మక చర్య" తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఫ్రాన్స్, జర్మనీ మరియు యుకె ఆదివారం తెలిపాయి. అదే సమయంలో, గల్ఫ్ దేశాలలో ఆందోళనలు పెరుగుతున్నాయి. బహ్రెయిన్‌లోని సల్మాన్ ట్రేడింగ్ జోన్‌లో ఒక విదేశీ నౌక క్షిపణి శిథిలాలతో ఢీకొన్న తర్వాత సంభవించిన అగ్నిప్రమాదంలో ఒక ఆసియా వ్యక్తి మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు.ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇరాన్ అమెరికా సైనిక స్థావరాలపై దాడులను తీవ్రతరం చేసిన తర్వాత మొత్తం గల్ఫ్ ప్రాంతం యుద్ధం అంచున ఉంది. ఆదివారం, ఇరాన్ దుఖ్మ్ ఓడరేవుపై దాడి చేసి, ఒమన్‌కు తన దాడులను విస్తరించింది. మలయాళీలు సహా ప్రవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అల్ జజీరా ప్రకారం, ఇరాన్ దాడిలో యుఎఇలో ముగ్గురు మరియు కువైట్, బహ్రెయిన్‌లలో ఒక్కొక్కరు మరణించారు.మధ్యప్రాచ్యంలో జరిగిన దాడిలో ముగ్గురు యుఎస్ సైనికులు మరణించారు. ఐదుగురు సైనికులు గాయపడ్డారు. ఇంతలో, అరేబియా సముద్రంలో యుఎస్ విమాన వాహక నౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్‌పై నాలుగు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ పేర్కొంది. భూమి మరియు సముద్రం ఇప్పుడు ఉగ్రవాద దాడి చేసేవారికి శ్మశానవాటికలుగా మారుతుందని కూడా ఆ ప్రకటన పేర్కొంది.మరోవైపు, ఇరాన్ యుద్ధనౌకను ముంచివేసినట్లు అమెరికా పేర్కొంది. విమాన వాహక నౌకపై దాడి జరిగిందని అమెరికా ఖండించింది. ఇరాన్ సార్వభౌమత్వాన్ని గౌరవించని అమెరికన్ సామ్రాజ్యవాద శక్తుల దాడుల నుండి తనను తాను రక్షించుకోవడానికి ఇరాన్ తన చర్యలను కొనసాగిస్తోంది. పౌరులను చంపిన యుఎస్-ఇజ్రాయిల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ గల్ఫ్ ప్రాంతంలోని యుఎస్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది.

# దాడిలో గాయపడ్డ ఖమేని భార్య మృతి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. ఖమేనీ నివాసంపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇప్పటికే ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, మనుమరాలు మృతి చెందారు. ఖమేనీ మృతితో ఇప్పటికే ఉద్రిక్తతలు చోటుచేసుకోగా, మన్సూర్ ఖోజాస్తే కూడా మరణించడంతో టెహ్రాన్ నాయకత్వంపై ఒత్తిడి పెరిగి ఉద్రితకలు మరింత పెరిగే అవకాశాలున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.సామ్రాజ్యవాద శక్తుల దాడులను భీకరంగా తిప్పికొడతామని ఇప్పటకే ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. అమెరికా స్థావరాలే లక్ష్యంగా అమెరికా మిత్రదేశాలుగా ఉన్న గల్ఫ్ దేశాలపై ఇరాక్ వరుసదాడులు జరుపుతోంది. దీంతో తక్షణమే ఇరాన్ దాడులు ఆపాలంటూ 6 గల్ఫ్ దేశాలు సోమవారంనాడు ఒక సంయుక్త ప్రకటన చేశాయి. ఇరాన్ దాడులు ప్రాంతీయ భద్రతకు ముప్పుగా పరణమించనున్నట్టు తెలిపాయి. యుద్ధం పొరుగుదేశాలతో కాదని, తెలివి తెచ్చుకోవాలని యూఏఓ హెచ్చరించగా, దాడులు ఆపకపోతే ఎలా రక్షించుకోవాలో తమకు తెలుసునంటూ ఆ సంయుక్త ప్రకటన పేర్కొంది. ఇజ్రాయెల్ సైతం ఇరాన్‌తో పాటు లెబనాన్‌కు దాడులను విస్తరించింది. హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థ ఇజ్రాయెల్ భూభాగంపై రాకెట్లు, డ్రోన్లతో దాడులకు పాల్పడటంతో ఇజ్రాయెల్ సైన్యం సైతం యుద్ధం దీర్ఘకాలం జరిగే అవకాశాలుంటాయని హెచ్చరించింది. సూయజ్ కాలువ గుండా జరిగే షిప్పింగ్‌ను కొన్ని కంపెనీలు ఇప్పటికే సస్పెండ్ చేశాయి. మధ్యప్రాచ్యంలోని పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి. మరోవైపు, ఇరాన్‌లో యుద్ధం ఇరాక్ తరహాలోనే ముగింపు లేని యుద్ధం కావచ్చనే అభిప్రాయాలను అమెరికా రక్షణ కార్యదర్శి పీటె హెగ్సెత్ తోసిపుచ్చారు. ఇరాక్‌తో పోల్చవద్దని, ఇది ఎంతమాత్రం ముగింపలేని యుద్ధం కాదని, ఇరాన్ సైనిక శక్తిని ధ్వంసం చేసేందుకు చేపట్టిన నిర్ణయాత్మకమైన దాడి అని చెప్పారు.

# జల్లికట్టులో తీవ్ర విషాదం

(మొదటి పేజీ తరువాయి)

తరలించారు. వారిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. జల్లికట్టు సందర్భంగా సరైన భద్రతా చర్యలు చేపట్టలేదని.. అందువల్లే ఇలా జరిగిందంటూ స్థానికులతో పాటు బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. మరో వైపు ఈ ఘటనలో మరణించిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇప్పటికే ఆసుపత్రికి చేరుకున్నారు. తమిళనాడులో జల్లికట్టు పోటీలను సంప్రదాయ క్రీడగా ప్రజలు జరుపుకొంటారు. ఈ క్రీడలను చూసేందుకు ఏపీ, తెలంగాణ ప్రజలు భారీగా తమిళనాడుకు తరలివస్తారు. పరుగులు తీస్తున్న పశువులను పట్టుకోవడానికి యువకులు ఉత్సాహంగా పోటీపడి పరుగెడతారు. ఇలాంటి సమయంలో కొన్నిసార్లు ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటుంటాయి.

# నేడు చంద్రగ్రహణంతో యాదాద్రి ఆలయం మూసివేత

**యాదగిరిగుట్ట,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ నెల 3న సంపూర్ణ చందగ్రహణం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయాన్ని మూసివేస్తున్నట్టు ఆలయ ఈవో భవానీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. చందగ్రహణం కారణంగా ప్రధానాలయంతో పాటు ఉపాలయాలు, అనుబంధ దేవాలయాలలో ఉదయం 7 గంటలలోపు సుప్రభాత, నిజాభిషేకం, అర్చనలు ముగించి మూసివేస్తామని వెల్లడించారు. 4వ తేదీన ఉదయం 3 నుంచి 5.30 గంటల వరకు ప్రధానాలయంతో పాటు ఉపాలయాలను తెరిచి గ్రహణ దోష పరిహారార్థం సంప్రోక్షణ, ఆలయ శుద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం సుప్రభాతం, తిరువారాధన, బాలబోగం, ఆరగింపు, నిజాభిషేకం నిర్వహించి, ఉదయం 8.45 గంటలకు ఉభయ దర్శనాలను ప్రారంభిస్తామని చెప్పారు.

# దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

(మొదటి పేజీ తరువాయి)

దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి రావాలని భావిస్తున్న సమయంలో పశ్చిమ ఆసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఆయన దుబాయ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇరాన్, ఆదివారం అర్ధరాత్రి దుబాయ్ ఎయిర్ పోర్ట్ లోని టెర్మినల్ - 3 సమీపంలో క్షిపణి దాడులు జరినట్లు సమాచారం. భద్రతా కారణాలతో అక్కడ ప్రభుత్వం విమానా రాకపోకలు నిలిపివేశాయి. దీంతో మంత్రి తుమ్మల అక్కడే చిక్కుకుపోయారు.దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌పై ఇరాన్ దాడుల నేపథ్యంలో అన్ని విమానాలను అక్కడ ప్రభుత్వం రద్దు చేయడంతో మంత్రి తుమ్మల దుబాయ్‌లోనే చిక్కుకు పోయారు. అయితే, తాను సురక్షితంగా ఉన్నానని, ఎయిర్ పోర్టు క్లియరెన్స్ ఇచ్చే వరకు ఇండియా తిరిగి రాలేని పరిస్థితి అని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని తుమ్మల తెలిపారు.

# వేయికోట్లు వసూలుకు వచ్చారా..?: రాహుల్ రాకపై కెటిఆర్ ఎద్దేవా

**హైదరాబాద్,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఆసక్తికర పోస్టు చేశారు. గాంధీ కుటుంబానికి రూ.1000 కోట్లు ఇస్తానని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్ పోస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. ఎక్స్‌లో కేటీఆర్ ఏమన్నారంటే.. 'హలో రాహుల్‌గాంధీ.. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఏటీఎం అయిన తెలంగాణకు స్వాగతం' అంటూ వెల్‌కమ్ చెప్పారు. 'మీరిప్పుడు సీఎం దగ్గర రూ.1000 కోట్లు వసూలు చేసుకోవడానికి వచ్చారా..?' అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. 'పనిలోపనిగా మీరు 100 రోజుల్లో అమలుచేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 ఇతర వాగ్దానాల పురోగతిని సమీక్షించడంపై కూడా కొంచెం శ్రద్ధ పెట్టండి' అని సూచించారు.

# పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేయించాలి...

**ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**



**ములుగు జిల్లా,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేసేవిధంగా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 59 దరఖాస్తు రాగా వాటిలో భూ సమస్యలు 14, ఇందిరమ్మ ఇండ్లు 14, పెన్షన్ 14, ఉద్యోగల కల్పన 04, ఇతర శాఖలకు సంబంధించినవి 13 ఫిర్యాదులు అందాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు వారి స్థాయిలో ప్రతి దరఖాస్తును పరిష్కరించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి దరఖాస్తు పై విచారించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం, పెండింగ్ వంటి అంశాలను సమీక్షిస్తానని తెలిపారు. దరఖాస్తులను తమ వద్ద పెండింగ్లో ఉంచవద్దని అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మండల ప్రత్యేక అధికారులు, ఎంపి డి ఓ లు, ఎంపి ఓ లు, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకునే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్లు స్లాబ్ లెవెల్ పూర్తి అయిన ఇళ్లను వెంటనే మిగతా పనులు పూర్తి అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులు ఫీల్డ్ విజిట్ చేసి గృహ ప్రవేశానికి సిద్ధం చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని పనులు పూర్తయిన ఇండ్లను వారానికి 10 చొప్పున గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపిఓ లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్**



**ములుగు జిల్లా,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి అధ్యక్షతన జిల్లాలోని లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ ఛాంబర్లో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జి వివిధ శాఖల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షా కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని విద్యార్థులకు పరీక్ష రాయడానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అన్నారు. పరీక్ష కేంద్రంలోనికి ఏ అధికారికి కూడా సెల్ ఫోన్ తో అనుమతి లేదని, పరీక్షా కేంద్రం సందర్శించడానికి వచ్చిన అధికారులు ఎవరైనా కూడా వారి యొక్క మొబైల్ ఫోన్లు పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటు చేసినటువంటి క్లాక్ రూమ్ వద్ద డిపాజిట్ చేసిన అనంతరం మాత్రమే పరీక్షా కేంద్రంలోకి వెళ్లాలని సూచించారు. చీఫ్ సూపర్డెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు కూడా సెల్ ఫోన్ తీసుకు రాకూడదని తెలిపారు. పోలీస్ డిపార్ట్మెంట్ ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఇద్దరు సిబ్బందిని ఉంచాలని, పోలీస్ స్టేషన్ నుండి ప్రశ్నాపత్రం పరీక్షా కేంద్రానికి తీసుకు వెళ్లేటప్పుడు, పరీక్ష అనంతరం సమాధాన పత్రాలను పోస్ట్ ఆఫీస్ లో డిపాజిట్ చేసే సమయంలో తప్పకుండా పోలీస్ సిబ్బంది సమక్షంలోనే జరగాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షా కేంద్రాల పరిసరాలలో పరీక్ష నిర్వహణ సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని అన్నారు. పరీక్ష సమయంలో ఎమ్మార్వోలు పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తారని డిటి స్థాయి అధికారులు సెట్టింగ్ స్క్వాడ్ గా ఉంటారని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరీక్షా కేంద్రం వద్ద ఏఎన్ఎంతో పాటుగా మెడికల్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. రూరల్ వాటర్ సప్లై, జిల్లా పంచాయతీ అధికారులు సంయుక్తంగా పరీక్ష కేంద్రాల వద్ద త్రాగునీరు ఏర్పాటు చేయాలని, పంచాయతీ శాఖ పరీక్షా కేంద్రాలను శుభ్రపరిచి సిద్ధంగా ఉంచాలని అన్నారు. ఆర్టిసి పరీక్ష కేంద్రాల వైపు పరీక్ష ప్రారంభానికి గంట ముందు, పరీక్ష అనంతరం గంట తర్వాత కూడా బస్సులు సరిపడా నడపాడాలని ముఖ్యంగా కన్నాయిగూడెం నుండి ఏటూరునాగారం వైపు, మంగపేట నుండి రాజుపేట సెంటర్ వైపు, అలుబాక నుండి వెంకటాపురం వైపు, ధర్మవరం నుండి వాజేడు పరీక్షా కేంద్రానికి, బీరెల్లి, కాటాపూర్ నుండి తాడ్వాయి పరీక్షా కేంద్రం వైపు, పత్తిపల్లి, దేవగిరి పట్నం నుండి ములుగుకి, ములుగు నుండి మోడల్ స్కూల్ బండారుపల్లి పరీక్ష కేంద్రాలకు విద్యార్థుల సంఖ్యకు సరిపడా బస్సులు విధిగా సమయానుగుణంగా నడపాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ సమావేశం జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్దార్థ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడగా సమావేశానికి డిపిఓ, ఎలక్ట్రిసిటీ అధికారి, మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్, ఆర్టీవో, పోలీస్ డిపార్ట్మెంట్ నుండి సిఐ , ఆర్టీసీ అధికారులు, రూరల్ వాటర్ సప్లై అధికారి, డిటిఓ కార్యాలయ సిబ్బందితో పాటుగా ఏసిజిఈ వినోద్ కుమార్, కోఆర్డినేటర్లు రాజు, శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై పోలీసుల వినూత్న ప్రచారం











**"అరైవ్ అలైవ్" నినాదంతో వై-జంక్షన్ వద్ద విస్తృత అవగాహన కార్యక్రమం**

**హెల్మెట్ ధరించిన వారికి సన్మానం**

**హెల్మెట్ లేనివారికి ఉచిత పంపిణీ**

**ఏటూరునాగారం,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులు వినూత్నమైన, ప్రజాప్రయోజనకర అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఏటూరునాగారం ఏఎస్పీ పర్యవేక్షణలో మంగళవారం మండల కేంద్రంలోని అత్యంత రద్దీగా ఉండే వై-జంక్షన్ వద్ద "అరైవ్ అలైవ్" నినాదంతో రోడ్డు భద్రతపై విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనదారులను నిలిపి, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను సవివరంగా వివరించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగం, అతివేగం వల్ల కలిగే ప్రమాదాలు, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రాణనష్టం, రాంగ్ రూట్ డ్రైవింగ్ ప్రమాదాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. **హెల్మెట్ ధరించిన వారికి ప్రత్యేక సన్మానం** ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్న పలువురు వాహనదారులను పోలీసులు ప్రత్యేకంగా అభినందించారు. వారికి శాలువాలతో సన్మానం చేసి, ఆదర్శ వాహనదారులుగా ప్రశంసించారు. ఈ దృశ్యం అక్కడున్న ప్రజలను ఆకట్టుకోవడంతో పాటు, ఇతర వాహనదారుల్లోనూ నిబంధనల పాటనపై ప్రేరణ కలిగించింది. **హెల్మెట్ లేనివారికి ఉచిత పంపిణీ** ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా, అవగాహన కల్పించడమే కాకుండా, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న సుమారు 20 మంది ద్విచక్ర వాహనదారులకు పోలీసులు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. దీంతో వాహనదారుల్లో సంతోషం వ్యక్తమవుతూ, పోలీసులపై అభిమానం వెల్లువెత్తింది. **"మీ ప్రాణం మీ కుటుంబానికి అమూల్యం"** ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, "మీ ప్రాణం మీ కుటుంబానికి అమూల్యం. క్షణిక నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించి, సురక్షితంగా ఇంటికి చేరాలి. హెల్మెట్, సీట్ బెల్ట్ మీ రక్షణ కవచాలు" అంటూ వాహనదారులకు హృదయపూర్వకంగా సూచించారు. **ప్రజల మద్దతుతో విజయవంతం** ఈ అవగాహన కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు వాహనదారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రతపై తమ మద్దతును తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించడం వల్ల రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# విద్యార్థులు శాస్త్ర పరిజ్ఞానం కలిగి ఉండాలి !

**● తెలంగాణ అనుక్షణం దినపత్రిక ఎడిటర్ సంపతి ప్రభాకర్ రావు**



**వరంగల్ ,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** పాఠశాల విద్యార్థులు తమ తమ పాఠ్య పుస్తకాల చదువుతో పాటు శాస్త్ర పరిజ్ఞానంపై ఆసక్తి కలిగి ఉండాలని తెలంగాణ అనుక్షణం దినపత్రిక ఎడిటర్ సంపతి ప్రభాకర్ రావు అన్నారు .సివి రామన్ జయంతి పురస్కరించుకొని జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా సోమవారం వరంగల్ శాంతి నగర్ లోని సన్ రైజ్ స్కూల్ లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిధిగా హాజరైన ప్రభాకర్ రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచం శాస్త్ర, సాంకేతిక రంగంలో దూసుకువెళ్తుందన్నారు . దాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు .అందుకే పాఠశాల దశ నుండి విద్యార్థులు సైన్స్ పై ఆసక్తి , అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు ట్రాస్మా స్టేట్ అడ్వైసర్ కొమ్మినేని భూపాల్ రావు , జిల్లా అడ్వైసర్ రాంపెల్లి రవి., జిల్లా ట్రెజరర్ దండపంతుల రామ్ మూర్తి ,డివిజన్ సెక్రటరీ విలియం , పాఠశాల ప్రిన్సిపాల్ భాశెట్టి వెంకటేశ్వర్లు ,కరెస్పాండెంట్ భాశెట్టి శారద , ఇంచార్జులు బి.వీరాస్వామి ,బి.భవాని , ట్రాస్మా సభ్యులు జి. వరప్రసాద్ ,జె.సంజీవ , పి .స్వామి , విద్యార్థులు పాల్గొన్నారు

# ఉరుములు , మెరుపుల నుంచి విద్యుత్ వ్యవస్థ రక్షణకు లైట్నింగ్ అరెస్టర్లు ఏర్పాటు



**ములుగు జిల్లా,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మెరుపు, పిడుగుల కారణంగా విద్యుత్ లైన్లు, ట్రాన్స్ఫార్మర్లు మరియు సబ్‌స్టేషన్లకు నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ములుగు సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఏ . ఆనందం తెలియజేశారు . విద్యుత్ పంపిణీ వ్యవస్థను రక్షించేందుకు కీలక ప్రాంతాల్లో లైట్నింగ్ అరెస్టర్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఇప్పటి వరకు 36 లైట్నింగ్ అరెస్టర్లు పెట్టామని చెప్పారు . లైట్నింగ్ అరెస్టర్ అనేది మెరుపు పిడుగు వల్ల ఉత్పన్నమయ్యే అధిక వోల్టేజ్‌ను భూమిలోకి సురక్షితంగా మళ్లించే రక్షణ పరికరం అని వివరించారు . దీని ద్వారా ట్రాన్స్ఫార్మర్లు, స్విచ్‌గియర్ పరికరాలు ఇతర విద్యుత్ యంత్రాంగం సురక్షితంగా ఉండి, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గుతాయి పేర్కొన్నారు . మెరుపులు కారణంగా కలిగే బ్రేక్‌డౌన్లు తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.వినియోగదారులు వర్షాకాలంలో ఇంటి విద్యుత్ పరికరాలకు సర్జ్ ప్రొటెక్టర్లు వినియోగించడం, మెరుపు సమయంలో అనవసరంగా విద్యుత్ పరికరాలను తాకకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సూపెరింటెండింగ్ ఇంజనీర్ తెలియజేశారు

# మహమ్మద్ గౌస్ పల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదం నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు



**ములుగు జిల్లా,మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండలం మమ్మద్ గౌస్ పల్లి గ్రామం సమీపంలోని రేలకుంట క్రాస్ వద్ద రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదం స్థానికంగా ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టేందుకు పోలీసులు మరియు సంబంధిత శాఖల అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.ములుగు సిఐ సురేష్, ఎస్సై చంద్రశేఖర్, ఆర్టీఏ శ్రీనివాస్, ఆర్ & బి ఏఈ చేతన్, నేషనల్ హైవే ఇన్‌చార్జ్ నాంచారయ్య కలిసి రోడ్డును పరిశీలించి పరిస్థితిని అంచనా వేశారు.యూ-టర్న్ వద్ద స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, వాహనాలు మెల్లగా వెళ్లేలా హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడం వంటి చర్యలు త్వరలో చేపడతామని అధికారులు తెలిపారు. ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.స్థానికులు కూడా ఈ నిర్ణయంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీవో ఎన్. శ్రీనివాస్



**ఖమ్మం, ప్రతినిధి మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో)గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్రీనివాస్ జిల్లా పరిపాలనతో సమన్వయంగా పనిచేస్తానని తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆర్డీవో ఎన్. శ్రీనివాస్ కలెక్టర్‌కు పూలమొక్కను అందజేశారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల వేగవంతమైన పరిష్కారం, రెవెన్యూ శాఖ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించే అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం.ప్రభుత్వ విధానాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించగా, ప్రజలకు పారదర్శకమైన మరియు వేగవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆర్డీవో ఎన్. శ్రీనివాస్ తెలిపారు.జిల్లా పరిపాలనలో భాగస్వామ్యంగా ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# వేములవాడ దర్గా అంశంలో హైకోర్టు తీర్పును అమలు చేయండి

**కూల్చిన చోటనే దర్గాను పునర్ నిర్మాణం చేయండి..వక్ఫ్ బోర్డు సూచనలు పాటించండి**

**సిరిసిల్ల కలెక్టర్‌కు, ఎస్పీకి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ లేఖ ద్వారా విజ్ఞప్తి**

**ఒవైసీ పంపిన లేఖను కలెక్టర్, ఎస్పీకి అందజేసిన గులాం అహ్మద్ హుస్సేన్**




**సిరిసిల్ల మార్చి 02(పిసి డబ్ల్యూ న్యూస్):** వేములవాడ రాజన్న ఆలయ ప్రాంగణంలో నెలకొని ఉన్న 800ఏండ్ల పురాతన దర్గా హజ్రత్ సయ్యద్ తాజుద్దీన్ ఖాజా బాగ్ సవార్ కు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని, దర్గాను కూల్చిన చోటనే పునర్ నిర్మాణం చేయాలని, వక్ఫ్ బోర్డు సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, రాజన్న సిరిసిల్ల కలెక్టర్ కు, ఎస్పీకి, సోమవారం లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈమేరకు అసదుద్దీన్ ఒవైసీ పంపించిన లేఖను ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సిరిసిల్లకు చేరుకొని, ఫిర్యాదు లేఖను కలెక్టర్, ఎస్పీలకు అందజేశారు. దర్గాకు సంబంధించి 2026, డబ్ల్యు.పి. నం. 6246 హైకోర్టు ముందు ఇచ్చిన హామీకి, ప్రభుత్వం కట్టుబడి వుండాలన్నారు. హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్ వివరాలు, ఆదేశాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దర్గా హజ్రత్ సయ్యద్ తాజుద్దీన్ ఖాజా బాగ్ సవార్ చుట్టూ అక్రమంగా కంచె వేయడం, బారికేడింగ్ చేయడాన్ని సవాలు చేస్తూ మొహమ్మద్ నజీమా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ దర్గా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉందని పిటిషన్ లో పేర్కొన్నారు.ఫిబ్రవరి 26న హైకోర్టు ముందు విచారణకు వచ్చిందని, ఇదే రోజున స్టాండింగ్ కౌన్సిల్ తరపున వాదనలు వినిపించి, విచారణ సమయంలో, ప్రభుత్వ గవర్నమెంట్ ప్లీడర్ కోర్టుకు హామీ ఇచ్చారన్నారు. దాని ఆధారంగా దర్గాకు సంబంధించి ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని ఆదేశిస్తూ కోర్టు ఒక ఉత్తర్వు జారీ చేయడానికి సంతోషించిందన్నారు. జి.పి ఇచ్చిన హామీని ఉల్లంఘించే ఏదైనా చర్య కోర్టు ధిక్కారానికి లోనవుతుందని లేఖలో పేర్కొన్నారు. దర్గా అంశంలో హైకోర్టు జారీ చేసిన నిర్దిష్ట ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని, తక్షణమే అట్టి ఆదేశాలను నిర్ధారించి, అమలు చేయాలని ప్రత్యేకంగా, దర్గా హజ్రత్ సయ్యద్ తాజుద్దీన్ ఖాజా బాగ్ సవార్ చుట్టుపక్కల ప్రాంతాలకు సంబంధించి ఎటువంటి చర్య తీసుకోకుండా చూసుకోవాలని కలెక్టర్, ఎస్పీని కోరారు. స్థానభ్రంశం లేదా కూల్చివేత, ఆవరణలో మార్పు లేదా నిర్మాణం, ఇప్పటికే ఉన్న ఏదైనా నిర్మాణం లేదా పవిత్ర వస్తువు తొలగింపు అంశంలో హైకోర్టుకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. దర్గా ముతవల్లి, దొడ్డి దారిన ఇచ్చిన లేఖ చెల్లుబాటు కాదని, ముతవల్లి తన పరిధి, హద్దులు దాటి, నిబంధనలు ఉల్లంఘించి ఇచ్చిన లేఖపై కఠిన చర్యలు తీసుకొని, క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రీడలకు ప్రోత్సాహం లేదు...!

**- మోదీ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రతి ఏటా పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్..**

**- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి.**





**మానకొండూర్,మార్చి02(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం లో క్రీడలకు ప్రోత్సాహం లేకుండా పోయిందని, మోడీ ప్రభుత్వం క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహించడానికి ప్రతి ఏటా ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి అన్నారు.ప్రధాన మంత్రి సంసద్ క్రీడా మహోత్సవం క్రీడా పోటీల్లో బాగా మానకొండూర్ నియోజకవర్గ స్థాయిలో సోమవారం మానకొండూర్ జడ్పి పాఠశాల లో క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుండి క్రీడాకారులను గుర్రాల వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి తో కలిసి పోటీలను ప్రారంభించారు. వాలీ బాల్, కబడ్డీ, ఖో ఖో తో పాటుగా అథ్లెటిక్స్ క్రీడలను నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభా పాఠవాలను చూపించిన వారికి విద్యా రంగాల్లో రిజర్వేషన్ లభిస్తుందని పేర్కొన్నారు. క్రీడలతో దేహ దారుఢ్యం పెరిగుతుందని అన్నారు. పాఠశాల స్థాయి నుండే క్రీడల పై శ్రద్ధ చూపించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అన్నారు. క్రీడలను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశ స్థాయిలో ప్రతీ నియోజకవర్గ స్థాయి నుండి పార్లమెంట్ స్థాయి వరకు ఇటువంటి క్రీడలను నిర్వహించేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వం లో ఎంపీ లు ముందుకు కొనసాగుతున్నారని, ఆ దిశలోనే స్థానిక ఎంపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకారం తో ఈ క్రీడలను నిర్వహించినట్లు పేర్కొన్నారు.క్రీడాల నిర్వహణ పై జిల్లా సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ పర్యవేక్షణ చేశారు.ఇట్టి క్రీడలకు అంపైర్ లు గా సంపత్, అనిల్, శ్రీధర్, వెంకటేష్ అరవింద్ లువ్యవహారించారు. మానకొండూర్ అధ్యక్షులు కంది రాజేందర్ రెడ్డి, కేశవపట్నం అధ్యక్షులు ఎనుగుల అనిల్, తిమ్మాపూర్ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, గన్నేరువరం అధ్యక్షులు తిప్పర్తి నికేష్,జిల్లా నాయకులు భాషబోయిన ప్రదీప్, దూలం కిరణ్, బోనాల మోహన్, గడ్డం అరుణ్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, అశ్విన్, ఉషాకోయిల రమేష్, అరెల్లి శ్రీహరి,శీలం కుమార్ యాదవ్,వీరగోని రాజు, రేగూరి సుగుణాకర్, మాదాసు కుమార్,రాచమల్ల శ్రీనివాస్, సాయి లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# క్రీడాకారుల ప్రతిభను గుర్తించడానికి పీఎం సంసద్ ఖేల్ మహోత్సవం ఎంతో దోహదం...

**- క్రీడాకారులను ప్రోత్సహించడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుంది**

**క్రీడల ప్రారంభోత్సవ సందర్భంలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు.**







**కరీంనగర్,మార్చ్02(పీసీడబ్ల్యూన్యూస్):** క్రీడాకారుల ప్రతిభను గుర్తించడానికి, చాటి చెప్పడానికి ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడానికి కట్టుబడి పనిచేస్తుందని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్ రావు అన్నారు.ప్రధానమంత్రి సంసద్ కేల్ మహోత్సవంలో భాగంగా సోమవారం రోజున కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ క్రీడా పోటీలు స్థానిక అంబేద్కర్ స్టేడియం లో ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రీడా మహోత్సవ కన్వీనర్ గుజ్జ శ్రీనివాస్, అసెంబ్లీ అసెంబ్లీ కమిటీ సభ్యులు తణుకు సాయి కృష్ణ, కడార్ల విమల్, జాడి బాల్ రెడ్డి, నాంపల్లి శ్రీనివాస్, నక్క ప్రమోద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రీడా పోటీకు డిప్యూటీ మేయర్ సునీల్ రావు ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ, కోకో, వాలీబాల్ అథ్లెటిక్స్ క్రీడల పోటీ నిర్వహించడం జరిగింది.కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ లు భూపతి రవీందర్, సౌ గాని కొమురయ్య, చొప్పరి జయశ్రీ, బండ రమణారెడ్డి, , సోమిడి వేణు, ఏపీపీ చంద్ర, మాసం గణేష్, నాంపల్లి రేణుక శ్రీనివాస్, పొన్నం లక్ష్మీ మొండయ్య,, కొంపెల్లి శ్వేతా రమన్, గొట్టేముక్కల ఉమారాణి వెంకట రమణ, గుగ్గిళ్ళపు మంజుల రమేష్, కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ వరాల జ్యోతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ అసెంబ్లీ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 200 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కార్యకర్తలు కటకం లోకేష్, గుంజేటి శివకుమార్, రమణారెడ్డి, పురం హరి, అడిచర్ల రాజు, సునీత, తేజస్వి, అశ్విని, వినీత్, రమేష్, సూర, సాయినాథ్, శ్రవణ్, నవీన్, శ్రీరాములు, అఖిల్, అక్షయ్, చిట్టిబాబు పైడ రవి, నాంపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ సాగు అభివృద్ధిపై సమీక్ష సమావేశం

**హనుమకొండ, ప్రతినిధి మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లాలో పామాయిల్ సాగు విస్తరణ, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు మరియు ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లాలో పామాయిల్ సాగు ప్రస్తుత పరిస్థితి, రైతులకు అందుతున్న సౌకర్యాలు, సాగు విస్తరణ అవకాశాలు మరియు ప్రభుత్వ ప్రోత్సాహక పథకాల అమలు పై సమగ్రంగా చర్చించారు. పామాయిల్ సాగు ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడంతో పాటు రాష్ట్రంలో నూనెగింజల ఉత్పత్తి పెంపు లక్ష్యంగా పనిచేయాలని చైర్మన్ సూచించారు.రైతులకు సాంకేతిక సూచనలు అందించడం, నాణ్యమైన మొక్కలు సరఫరా చేయడం, సాగులో ఎదురయ్యే సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం పై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆయన ఆదేశించారు. పామాయిల్ సాగుపై రైతుల్లో అవగాహన పెంచుతూ వారిని ప్రోత్సహించాలని కూడా సూచించారు.జిల్లాలో పామాయిల్ సాగును మరింత విస్తరించేందుకు శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు, ఆయిల్ ఫెడ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని వినతి..



**కరీంనగర్ టౌన్ మార్చి 2(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈనెల 05-03-2026 నుండి 13-03-2026 వరకు నిర్వహించనున్న ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దిన్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఈరోజు శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ సతీష్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు. పవిత్రమైన రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం విద్యార్థులు ఉపవాస దీక్షలు పాటిస్తున్న నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం ఇబ్బందికరమని వినతిపత్రంలో పేర్కొన్నారు. కరీంనగర్ పరీక్షా కేంద్రాలకు జిల్లా విద్యార్థులతో పాటు పక్క జిల్లాలు మరియు దూర ప్రాంతాల నుండి కూడా విద్యార్థులు రావాల్సి ఉంటుందని, ఎండ తీవ్రతలో ఉపవాస స్థితిలో ప్రయాణం చేయడం వారికి శారీరకంగా కష్టసాధ్యమవుతుందని తెలిపారు. కాబట్టి పరీక్షల సమయాన్ని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మార్చాలని, అలాగే పరీక్షలను ఈనెల 20-03-2026 తరువాత నిర్వహించాలని రిజిస్ట్రార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ నాయకులు నేహాల్ అహ్మద్, లయీఖ్ ఖాద్రీ, మొహమ్మద్ కలిమొద్దీన్, మొహమ్మద్ సలీం, అబ్దుల్ బారీ, ఎండీ బషీర్, ఆరిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## చౌడేపల్లి మండలంలో అగ్నిప్రమాదం : రూ 20 వేలు ఆస్తి నష్టం



**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** చౌడేపల్లి మండలం ఆమినిగుంట పంచాయతీలో అగ్నిప్రమాదం సంభవించి రూ.20. వేలు ఆస్తి నష్టం జరిగిందని పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. సింగిరిగుంట గ్రామ సమీపంలో ఎం.ప్రకాష్ అను వ్యక్తికి చెందిన టమోటా చెట్లకు నాటే కట్టెలు అగ్ని ప్రమాదానికి గురైందని ఆయన తెలిపారు. రాబడిన సమాచారం మేరకు వెంటనే తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడం జరిగిందని ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. రమేష్ తన పొలం వద్ద ఉంచిన కట్టెల్లో ఒకసారి ఇగ మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు మంటలను ఆర్పి ప్రయత్నం చేశారు. ఫైర్ అధికారులు చేరుకోవడంతో మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఈ మంటలలో కట్టెలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు ధూమపానం సేవించి సిగరెట్ ముక్కలను ఆర్పకుండా పడవేయడంతో ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు.

## అధికారికంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి

**ఖమ్మం, ప్రతినిధి మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** శాసన సభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభ స్పీకర్ గా శ్రీపాదరావు అందించిన సేవలను స్మరిస్తూ, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జెడ్పి సిఇఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడిగా సుగవాసి ప్రసాద్ బాబు ప్రమాణ స్వీకారం - కార్యకర్తలతో జనసంద్రమైన మదనపల్లె..

● స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయఢంకా మోగిస్తాం..




**ఏపీ: అన్నమయ్య జిల్లా: మదనపల్లి: మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం మదనపల్లి పట్టణంలోని రామ తులసి కన్వెన్షన్ నందు సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. రాజంపేట పార్లమెంట్ నూతన అధ్యక్షుడిగా సుగవాసి ప్రసాద్ బాబుతో పాటు నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఏడు నియోజకవర్గాల నుండి వేల సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, షాజహాన్ బాషా, రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి, ఇన్చార్జిలు రూపానంద రెడ్డి, జగన్మోహన్ రాజు, చల్లా బాబు, కార్పొరేషన్ ఛైర్మెన్లు, డైరెక్టర్లు, రాష్ట్ర స్థాయి నాయకులు, టిడిపి సీనియర్ మహిళలు, తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన చంద్రబాబు నాయుడు గారికి, లోకేష్ బాబు గారికి, పల్లా శ్రీనివాసరావు గారికి ధన్యవాదాలు తెలిపారు. నాయకులకు, కార్యకర్తలకు మధ్య సమన్వయకర్తగా ఉంటూ, ప్రతి కార్యకర్తకు అండగా నిలబడతాని. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ జెండా ఎగురవేసేందుకు తన వంతు కృషిని అందిస్తానని ఆయన అన్నారు. ఎమ్మెల్యేలు, ఇన్చార్జిల సమన్వయంతో కలిసి పనిచేస్తామని తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి...

● ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, ప్రతినిధి మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.కొణిజెర్ల మండలం దిద్దుపూడి గ్రామానికి చెందిన అమర్లపూడి భాస్కర రావు సర్వే నెంబర్ 82, 83 లో తమ భూమి ఉందని, సర్వే నెంబర్ 81లో ఉన్న తమ భూమిని సబ్ స్టేషన్ కోసం కేటాయించగా హైకోర్టు కేసు పెండింగ్ ఉండటంతో ఆ స్థలం నుంచి మార్చడం జరిగిందని, ప్రస్తుతం మున్సిపాలిటీ వారు అదే స్థలంలో ఎటు వంటి సర్వేలు చేపట్టకూడదని హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ డంపింగ్ యార్డ్ కు కేటాయించారని, దీనిని సరిచేసి తమ పేరు మీద పట్టా పాస్ పుస్తకాల జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.నేలకొండపల్లి మండలం ముతాపురం గ్రామం పెద్దతండకు చెందిన గిరిజనులు గత ప్రభుత్వం సర్వే నెంబర్ 663 నందు తమకు ఆరు ఎకరాల స్థలం కేటాయించిందని, అందులో నుంచి మా గ్రామస్తులకు బంజారా భవన్, సేవాలాల్ మందిరం కొరకు స్థలం కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, నేలకొండపల్లి తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.చింతకాని మండలం పందిళ్ళపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీ ప్రియ అనంతసాగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 181 లో వ్యవసాయ భూమి ఉందని, సర్వే నెంబర్ 182 లో ఉన్న మరో ఎకరం భూమి కూడా తాము వారసత్వంగా సాగు చేసుకుంటున్నా మని, తమ పట్టా పాస్ పుస్తకంలో ఆ భూమి వివరాలు కూడా నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, చింతకాని తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాల సేవల అనంతరం ఘన వీడ్కోలు

● నలుగురు ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ నేపథ్యంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్




**ఖమ్మం, ప్రతినిధి మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** దీర్ఘకాలం ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించి, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి ఘనంగా వీడ్కోలు పలికారు.కలెక్టరేట్ లో 2026 ఫిబ్రవరిలో పదవి విరమణ పొందిన నలుగురు ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు.పశు సంవర్ధక శాఖ లో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ గా పని చేసిన వి. మల్లేశ్వరి, పంచాయతీరాజ్ శాఖకు చెందిన టైపిస్టు షేక్ జానీ మియా, సోషల్ వెల్ఫేర్ శాఖలో వంటమనిషిగా పనిచేసిన పి. అంజమ్మ, వైద్య, ఆరోగ్య శాఖలో కార్యాలయ సబార్డినేట్ గా పనిచేసిన గిరిజ ల పదవి విరమణ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 30 నుంచి 35 సంవత్సరాల పాటు ప్రజా సేవలో నిర్విరామంగా సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ తర్వాత వారు జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యవంతంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.అనంతరం పదవి విరమణ పొందిన సిబ్బందిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, పదవి విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ విగ్రహాలు కాదు.. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

**విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాలి**

**తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ**



**హైదరాబాద్ మార్చి02 (పిసిడబ్ల్యూ న్యూస్):** గాంధీ విగ్రహాలు కాదు సంక్షేమ హాస్టల్స్కు సొంత భవనాలు నిర్మించాలని తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విద్యార్థులతో కలిసి ఆయన లేఖలు వ్రాశారు. అనంతరం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్షిప్స్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు బాండ్ పేపర్లు రాయించుకొని హాల్ టికెట్లు ఇచ్చారని అన్నారు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను యాజమాన్యాలు వేధిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి గాంధీ విగ్రహాలు, మూసీ నది సుందరీకరణ చేపట్టడం కాదు ముందుగా సంక్షేమ హాస్టల్స్కు సొంత భవనాలు నిర్మించి విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఒక్కటి కూడా సంక్షేమ హాస్టళ్లకు స్వంత భవనాలు లేవని, అద్దె భవనాలకు అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యాజమానులు ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, పరీక్షల సమయంలో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. సంక్షేమ హాస్టళ్లు నిర్మించాలని, విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలని కోరుతూ ఢిల్లీ వరకు వెళ్ళి రాహుల్ గాంధీని కలిసి వివరిస్తామని ఆయన తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు నరేష్, మోహన, రాంబాబు, జగన్, అభిలాష్, లక్ష్మణ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా 10వ తరగతి పరీక్షలకు హాజరు కావాలి: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**గత సంవత్సరాల ప్రశ్నా పత్రాలతో టెస్ట్ లు రాసి విద్యార్థులు ప్రాక్టీస్ చేయాలి**

**పదవ తరగతి విద్యార్థులకు భక్త రాందాస్ కళాక్షేత్రంలో నిర్వహించిన మోటివేషన్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, ప్రతినిధి మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా 10వ తరగతి పరీక్షలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.పదవ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం స్థానిక శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన మోటివేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జీవితంలో పదవ తరగతికి చాలా ప్రాముఖ్యత ఉందని, విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరు కావాలని, మనం భయపడితే చదివింది కూడా మర్చిపోతామని, పరీక్షలకు మరో 2 వారాల గడువు ఉందని, ఉన్న సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భయపడితే మనకు ఉన్న సమయాన్ని సరిగ్గా వాడుకోలేమన్నారు. మనం నమ్మకంగా ఉంటూ పరీక్షలకు హాజరైతే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. నెల రోజుల పాటు పదవ తరగతి పరీక్షలు ఉంటాయని, విద్యార్థులు ఫోకస్ తో ప్రిపేర్ ఐతే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు.విద్యార్థులు వీలైనంత వరకు గత సంవత్సరాలలో వచ్చిన ప్రశ్న పత్రాలకు సొంతంగా పరీక్ష రాసి పరీక్షించుకోవాలని అన్నారు. విద్యార్థులు ఎన్ని ప్రాక్టీస్ టెస్ట్ లు రాస్తే అంత మెరుగ్గా ఫైనల్ ఎగ్జామ్ లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారని అన్నారు. ఒలంపిక్ క్రీడాకారులు ఎలాగైతే ప్రతి రోజూ ప్రాక్టీస్ చేస్తారో, అదే విధంగా మనం పాఠ్యాంశాల పునశ్చరణతో పాటు ప్రాక్టీస్ పరీక్షలు అధికంగా రాయాలన్నారు.విద్యార్థులు తాము ఏ సబ్జెక్టులో వీక్ ఉన్నామో తెలుసుకొని అధిగమించేందుకు కొంత అధిక సమయం కేటాయించాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులు నిద్రలేకుండా ఎట్టి పరిస్థితుల్లో ఉండవద్దని, ప్రతి రోజు కనీసం 6 నుంచి 7 గంటల పాటు మంచి నిద్ర ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో బయట ఆహారం తీసుకోవద్దని, బయట ఎక్కువ తిరగవద్దని, మంచినీరు తగినంత త్రాగాలని కలెక్టర్ సూచించారు.అనంతరం మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి చైతన్య జైని, మోటివేషన్ స్పీకర్ గంపా నాగేశ్వర రావు, అధికారులు, పాల్గొన్నారు.

# పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి...

**99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యాచరణ అమలు ప్రతి శాఖ ప్రాధాన్యతగా తీసుకోవాలి**

**పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, 99 రోజుల కార్యాచరణపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం, ప్రతినిధి మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి పాలన కార్యాచరణపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి సమీక్షించారు.పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై సంపూర్ణ వివరాలను తెలంగాణ నార్త్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎస్ఈ వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇంటి పై కప్పుపై సౌర ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే ఇంటి యజమానులకు సబ్సిడీ ఇస్తున్నదని అన్నారు. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ ఖర్చు తగ్గడంతో ప్రయోజనం కలుగుతుందని, అవసరమైన వారు www.pmsuryaghar.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఈ పథకం ముఖ్య పాత్ర పోషిస్తుందని, ఇంటిపై 1 కిలో వాట్ సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు 30 వేల రూపాయలు, 2 కిలో వాట్ ఏర్పాటుకు 60 వేల రూపాయలు, 3 కిలో వాట్ ఏర్పాటుకు 78 వేల రూపాయలు సబ్సిడీ వస్తుందని, మిగిలిన నిధులు బ్యాంకు లోన్ ద్వారా సమకూర్చుకోవచ్చని అన్నారు. ఆసక్తి గల వారు ముందస్తుగానే తమ ఇండ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్యానల్ ఏర్పాటుకు ముందుకు రావాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యాచరణ అత్యంత కట్టుదిట్టంగా చేపడుతుందని, మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రభుత్వ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో మున్సిపల్, పంచాయతీ శాఖలతో పాటు అన్ని శాఖలు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి అప్ డేట్ వివరాలు ఎప్పటికప్పుడు గూగుల్ షీట్ లో నమోదు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కు సంబంధించి పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, రెడ్కో జిల్లా మేనేజర్ అజయ్ కుమార్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బహుమతుల అందజేత


**రామన్నపేట మార్చి 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణా స్టేట్ లెవెల్ బాయ్స్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలలో ప్రథమ స్థానం లో నిలిచినజోగులాంబగధ్వాల జట్టు: 45 వ తెలంగాణా స్టేట్ లెవెల్ సబ్ జూనియర్ బాయ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ పోటీలలో ప్రథమ బహుమతి జోగులాంబ గధ్వాల జట్టు గెలుచుకోగా, ద్వితీయ బహుమతి వికారాబాద్ జట్టు గెలుచుకుంది, తృతీయ స్థానం లో యాదాద్రి జట్టు నిలిచింది గర్ధాస్ విక్రమ్ సర్పంచ్ చేతుల మీదుగా గెలిచిన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్ లు ఇవ్వడం జరిగిందిమరియు ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డ్ మెంబెర్ వరికుప్పల స్వామి,షూటింగ్బాల్ తెలంగాణా స్టేట్ జనరల్ సెక్రటరీ. ఐలయ్య, యాదాద్రి దిష్టిక్ అధ్యక్షులు మోత్కూరి యాదయ్య, సెక్రటరీ మోత్కూరి మానస,వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు,స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపాల్ నిర్మల చేతుల మీదుగా బహుమతులు సర్టిఫికెట్ లు అందించడం జరిగింది ,వివిధ జిల్లాల కోచ్లు,చంద్రమౌళి,స్కూల్ పీడీ మణి,క్రీడాకారులుమాట్లాడుతు మంచి ఏర్పాట్లు చేసిన సర్పంచ్ కి ధన్యవాదములు తెలిపారు. ఈకార్యక్రమం లో సీనియర్ నాయకులు మందడి విద్యాసాగర్ రెడ్డి, రాజన్నగారి రమేష్, రవ్వ నర్సింహా, సింగణబోయిన జంగయ్య,ఈర్లపల్లి మల్లయ్య,గోళ్లేపల్లి యాదయ్య,ఈర్లపల్లి రమేష్,గర్దాస్ కరుణాకర్ ,జిట్టబోయిన వెంకటేష్,బోనగిరి సంజీవ,బోనగిరి మధు, వెలిమినేటి నరేష్, గోగికార్ రాజుకుమార్,గర్దాస్ వెంకటేష్, గర్దాస్ శ్రీకాంత్, గడ్డం సాయి,కాటపల్లి నరేష్,గొర్ల నవీన్, గర్దాస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



PCW తెలుగు దినపత్రిక

మంగళవారం 03 మార్చి 2026

# నేడు హోలీ



**హోలీ.. సరదాల రంగేళీ!**

**సందడి వెనుక ప్రమాదం.. జరభద్రం**

**నిపుణుల సూచనలు పాటిస్తే సరి..**

**డాక్టర్ ఎం. మనోజ్ రెడ్డి మెడికల్ ఆఫీసర్, యూపీహెచ్ సీ**

**హైదరాబాద్ మార్చి 02(పిసిడబ్ల్యూ న్యూస్):** హోలీ రంగుల పండుగ; ఈ పండుగ అనేది వివిధ రంగుల మధ్య ఆనందం, ఐక్యత, సంతోషాలను జరుపుకునే ఉత్సవం. అయితే, సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే హోలీ రంగులు చర్మం మరియు జుట్టుపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. కాబట్టి శాశ్వత నష్టం భయంలేకుండా పండుగ ఆనందాన్ని ఆస్వాదించేందుకు ముందస్తు మరియు అనంతర సంరక్షణ చాలా అవసరం.హోలీ రంగుల వల్ల కలిగే ప్రమాదాలు అవగాహనహోలీ సమయంలో ఉపయోగించే తక్కువ ధరలో లభించే సింథటిక్ రంగుల్లో సీసం , పాదరసం , అస్బెస్టాస్ వంటి హానికర రసాయనాలు ఉండే అవకాశం ఉంది. ఇవి కింది సమస్యలకు దారితీయవచ్చు:1. చర్మ రాపిడి మరియు అలర్జీలుసింథటిక్ రంగులలోని కఠిన రసాయనాలు చర్మం యొక్క సహజ పీహెచ్ సమతౌల్యాన్ని దెబ్బతీస్తాయి. దీని వల్ల దద్దుర్లు, మంట, ఎర్రదనం, తీవ్రమైన సందర్భాల్లో రసాయన దహనం కూడా కలగవచ్చు.2. పొడితనం మరియు నీరసంరంగుల్లోని రసాయనాలు చర్మం మరియు జుట్టులోని సహజ తైలం ను తొలగిస్తాయి. దీని వల్ల చర్మం పొడిగా మారి, పొరలు వదలడం మరియు సున్నితత్వం పెరగడం జరుగుతుంది.3. జుట్టు నష్టంహోలీ రంగులలోని రసాయనాలు జుట్టు కేరటిన్ నిర్మాణాన్ని బలహీనపరుస్తాయి. దీని ఫలితంగా జుట్టు విరగడం, స్ప్లిట్ ఎండ్స్ రావడం, మెరుపు తగ్గడం జరుగుతుంది. తల చర్మానికి రాపిడి కలగవచ్చు.4. కళ్లకు రాపిడికళ్లలోని మృదువైన కణజాలం రసాయనాలకు అత్యంత సున్నితమైనది. రంగులు కళ్లలో పడితే మంట, ఎర్రదనం, నీరు కారడం, తీవ్రమైన సందర్భాల్లో కార్నియా గాయాలు లేదా తాత్కాలిక చూపు సమస్యలు కలగవచ్చు.హోలీ రంగుల నుంచి చర్మాన్ని ఎలా రక్షించాలి?ఏ. హోలీకి ముందు చర్మ సంరక్షణ1. నూనె రాయడంకొబ్బరి నూనె, బాదం నూనె, ఆవ నూనె వంటి సహజ నూనెలతో శరీరమంతా రాయాలి. ఇది చర్మంపై ఒక రక్షణ పొరను ఏర్పరచి రంగులు లోపలికి చొచ్చుకుపోకుండా కాపాడుతుంది. చెవుల వెనుక, మెడ, మడతల ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.2. మాయిశ్చరైజర్ ఉపయోగించడం హయాలురానిక్ యాసిడ్, సెరమైడ్స్, గ్లిసరిన్ వంటి పదార్థాలు ఉన్న గట్టి మాయిశ్చరైజర్ ఉపయోగించాలి. ఇది చర్మాన్ని తేమతో నింపి రసాయనాల ప్రభావాన్ని తగ్గిస్తుంది.3. సన్‌స్క్రీన్ఎస్ పీ ఎఫ్ 30 లేదా అంతకంటే ఎక్కువ ఉన్న బ్రాడ్-స్పెక్ట్రమ్ సన్‌స్క్రీన్ ఉపయోగించాలి. ప్రతి రెండు గంటలకు ఒకసారి మళ్లీ రాయాలి.4. గోళ్ల సంరక్షణడార్క్ నెయిల్ పాలిష్ రాసుకోవడం వల్ల రంగులు గోళ్లపై ముద్ర పడకుండా ఉంటుంది. క్యూటికల్స్‌పై పెట్రోలియం జెల్లీ రాయడం మంచిది.5. లిప్ బామ్ఎస్ పీ ఎఫ్ ఉన్న లిప్ బామ్ ఉపయోగించడం వల్ల పెదవులు పొడిబారకుండా మరియు రసాయనాల నుంచి రక్షించబడతాయి.బీ. హోలీ తరువాత చర్మ సంరక్షణ1. మృదువైన క్లెన్సర్ ఉపయోగించండిసల్ఫేట్-రహిత, మైల్డ్ క్లెన్సర్‌తో రంగులు తొలగించాలి. కఠినమైన సబ్బులు, స్క్రబ్‌లు వాడకండి.2. నూనె తొలగించడంహోలీ ముందు రాసుకున్న నూనెను సున్నితమైన క్లెన్సర్‌తో తొలగించాలి.3. లోతైన మాయిశ్చరైజింగ్తేమ కోల్పోయిన చర్మానికి గట్టి మాయిశ్చరైజర్ ఉపయోగించాలి. పొడిగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.4. రాపిడిని తగ్గించడంఅలోవెరా జెల్ లేదా కాలమైన్ లోషన్ ఉపయోగించాలి. చల్లటి కాంప్రెస్ ఉపయోగించడం వల్ల ఎర్రదనం తగ్గుతుంది.5. వేడి నీరు వాడకండిరంగులు కడిగేటప్పుడు గోరువెచ్చని నీటిని మాత్రమే ఉపయోగించాలి.6. హైడ్రేటింగ్ ఫేస్ ప్యాక్తేనె మరియు అలోవెరాతో తయారుచేసిన ఫేస్ ప్యాక్ చర్మాన్ని తేమతో నింపుతుంది.హోలీ రంగుల నుంచి జుట్టును ఎలా రక్షించాలి?ఏ. హోలీకి ముందు జుట్టు సంరక్షణ1. నూనె మసాజ్కొబ్బరి, ఆలివ్ లేదా ఎరండ నూనెతో తల మరియు జుట్టుకు మసాజ్ చేయాలి.2. జుట్టు కట్టుకోవడంజుట్టును బన్ లేదా జడగా కట్టుకోవడం వల్ల రంగుల ప్రభావం తగ్గుతుంది.3. హెయిర్ సీరమ్హెయిర్ సీరమ్ రాయడం వల్ల జుట్టు పై రక్షణ పొర ఏర్పడుతుంది.4. తల కప్పుకోవడంస్కార్ఫ్ లేదా టోపీతో జుట్టును కప్పుకోవచ్చు.బీ. హోలీ తరువాత జుట్టు సంరక్షణ1. గోరువెచ్చని నీటితో కడగండిమొదట గోరువెచ్చని నీటితో జుట్టును బాగా కడగాలి.2. మైల్డ్ షాంపూసల్ఫేట్-రహిత మృదువైన షాంపూ ఉపయోగించాలి. అవసరమైతే రెండు సార్లు కడగాలి.3. డీప్ కండిషనింగ్డీప్ కండిషనింగ్ మాస్క్ లేదా హెయిర్ ప్యాక్ కనీసం 30 నిమిషాలు ఉంచాలి.4. హెయిర్ సీరమ్తడి జుట్టుకు సీరమ్ రాసి చిక్కులు తొలగించాలి మరియు మెరుపు ఇవ్వాలి.5. హీట్ స్టైలింగ్ నివారించండికొన్ని రోజులు హెయిర్ డ్రైయర్ లేదా స్ట్రెయిటెనర్ వాడకండి.6. సహజ రిన్స్నిమ్మరసం లేదా ఆపిల్ సెడర్ వెనిగర్‌తో జుట్టు కడిగితే మిగిలిన రంగులు తొలగించవచ్చు.హోలీ పండుగను సంపూర్ణంగా ఆస్వాదించండి కానీ ఈ సూచనలు మాత్రం పాటించండి. తద్వారా మీతో పాటుగా మీ ప్రియమైన వారు కూడా సురక్షితంగా ఉండగలరు.



# ఇప్పటిదాకా ఒక లెక్క: ఇకపై మరో లెక్క...

- ఇళ్ల నిర్మాణాలకు డబ్బులు అడగొద్దు...దరఖాస్తుదారులను ఇబ్బంది పెట్టొద్దు
బ్రోకర్లు, ఏజెన్సీల ద్వారా లంచాలు తీసుకుంటే ఇబ్బందులు తప్పవు
- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించే వారిపై క్రిమినల్ చర్యలు తప్పవు
- తప్పు చేస్తే మిమ్ముల్ని భగవంతుడు కూడా కాపాడలేరు
- మీరు నిజాయితీగా ఉంటే కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నేను తీసుకుంటా
- అవినీతికి అర్రులు చాచే వాళ్లకు ఇక్కడ తావు లేదు బదిలీపై వెళ్లొచ్చు
- మీపై రాజకీయ ఒత్తిళ్లు ఉండవు బీజేపీ కార్పొరేటర్లు అవినీతికి చోటివ్వరు
- ఇతరులతో అంటకాగి తప్పు చేస్తే మీకే ముప్పు
- కరీంనగర్‌లో ఇంటి నిర్మాణానికి ఈజీగా పర్మిషన్లు వస్తాయనే నమ్మకం కలిగించండి
- రాష్ట్రమంతా టౌన్ ప్లానింగ్ విభాగంలో మార్పులకు కరీంనగర్ స్ఫూర్తిగా నిలిచేలా పనిచేయండి
- టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవిన్యూ శాఖలపై తక్షణమే కార్పొరేటర్లకు అవగాహన సదస్సు నిర్వహించండి
- టౌన్ ప్లానింగ్ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ దిశా నిర్దేశం
- కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్లతో కలిసి టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష
- కరీంనగర్ కు ఐకానిక్ గా నిలిచే ప్రాజెక్టులపై ప్రతిపాదనలు రూపొందించాలని సూచన
- కరీంనగర్ కార్పొరేషన్ లో మార్పుకు శ్రీకారం చుట్టిన బండి సంజయ్...

**కరీంనగర్,మార్చి02(పిసిడబ్ల్యూ న్యూస్):** "ఒక్క ఛాన్స్ ఇవ్వండి. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించండి. మార్పు చూపిస్తా. అవినీతికి తావు లేకుండా కరీంనగర్ ను అభివృద్ధి చేస్తా." మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఇదే ప్రధాన అస్త్రంగా చేసుకుంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన ప్రచారమిది. బండి సంజయ్ విజప్తికి సానుకూలంగా స్పందించిన కరీంనగర్ ప్రజలు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బీజేపీకి అత్యధిక స్థానాలను అప్పగించి మేయర్ పీఠాన్ని కట్టబెట్టారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ ఇచ్చిన మాటకు కట్టుబడి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రక్షాళనకు నడుం బిగించారు. అందులో భాగంగా కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులతో కలిసి ఈరోజు ఉదయం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. టౌన్ ప్లానింగ్ విభాగం డీసీపీ, ఎసీపీలుసహా సిబ్బంది అంతా హాజరైన ఈ సమావేశంలో "ఇప్పటిదాకా ఒక లెక్క. ఇకపై మరో లెక్క. ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల కోసం డబ్బులు అడగొద్దు బాధితులను ఇబ్బంది పెట్టొద్దు. అవినీతికి తావు లేకుండా ఇంటి అనుమతుల కోసం వచ్చే ప్రజలకు సులువుగా అనుమతి ఇచ్చేలా చేయాల్సిందే. బ్రోకర్ల ద్వారా ఏజెన్సీలను పెట్టుకుని ప్రజలను వేధిస్తూ లంచాలు తీసుకుని అనుమతి ఇవ్వాలనుకుంటే మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదు. అలాంటి వాళ్లు ఎవరైనా ఉంటే వెంటనే బదిలీపై వెళ్లవచ్చు. నిజాయితీగా రూల్స్ ప్రకారం పనిచేసే వాళ్లపై మా రాజకీయ ఒత్తిళ్లు ఉండవు. వాళ్లపై ఈగ కూడా వాలనివ్వను. కంటికి రెప్పలా కాపాడుకుంటా."అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఎమన్నారంటేమిమ్ముల్ని బెదిరించడానికో, భయపెట్టడానికో పిలవలేదు. పూర్తి పారదర్శకతో పనిచేయాలి. మీరు నిజాయితీగా, నిబంధనల ప్రకారం పనిచేస్తూ ఇంటి పర్మిషన్ల కోసం మీ వద్దకు వచ్చే ప్రజలకు సులువుగా అనుమతి ఇచ్చే విషయంలో మీకు పూర్తిగా స్వేచ్ఛనిస్తున్నా. మీరు తప్పు చేస్తే భగవంతుడు కూడా మిమ్ముల్ని కాపాడలేరు. మీపై రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా పట్టించుకోవద్దు. మా బీజేపీ కార్పొరేటర్ల నుండి ఒత్తిళ్లు రాకుండా నేను చూసుకుంటా. మీరు మాత్రం నిజాయితీగా ఉంటూ నిబంధనల ప్రకారం పనిచేయాల్సిందే. అట్లా చేస్తే మీపై ఈగను కూడా వాలనివ్వను. మిమ్ముల్ని కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యతను పూర్తిగా నేనే తీసుకుంటా. రూల్స్ కు భిన్నంగా అధికార పార్టీతో అంటకాగుతూ అవినీతికి పాల్పడుతూ ప్రజలను ఇబ్బంది పెడితే మాత్రం నష్టపోయేది మీరే. ఇకపై మీ దగ్గరకు వచ్చే ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు. కసరుకోవద్దు. చిరునవ్వుతో పలకరించండి. వారికి నిబంధనలను వివరించి అందుకు అనుగుణంగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకునేలా సహకరించండి. అనుమతి ఇవ్వండి. అనుమతి లేకుండా అనధికారికంగా ఇండ్లు, కమర్షియల్ భవనాలు నిర్మిస్తుంటే ఆరంభంలోనే వాటిని ఆపాలి. నోటీసులివ్వాలి. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం ఎన్ని నిర్మాణాలు అక్రమంగా, అనధికారికంగా కొనసాగుతున్నాయో గుర్తించి వాటన్నింటినీ వారం రోజుల్లోపు నోటీసులివ్వండి. నోటీసులకు సమాధానం ఇవ్వకపోయినా, అక్రమ నిర్మాణాలను కొనసాగించినా కొరడా ఝుళిపించండి. డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సహాయం వాటిని కూల్చివేయండి. ప్రభుత్వ స్థలాలను పూర్తిగా కాపాడాలి.గతంలో కరీంనగర్ లో ఇంటి ముందు ఇసుక, కంకర కన్పిస్తే ఒకవైపు కార్పొరేటర్లు, ఇంకోవైపు టౌన్ ప్లానింగ్ అధికారులు వాలిపోయి బెదిరించి వసూళ్లు చేసే వాళ్లు. అలాంటి కార్పొరేటర్లను ప్రజలు తిరస్కరించారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన వాళ్లలో 46 మంది కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లే ఉన్నారు. ముఖ్యంగా బీజేపీ కార్పొరేటర్లు అలాంటి వాటి జోలికి పోరు. ఇతర పార్టీల కార్పొరేటర్లు ఎవరైనా వాటికి అలవాటు పడితే రూల్స్ ప్రకారం వ్యవహరించండి. ఇకపై అలాంటి వాటికి తావు లేకుండా ఉండటం కోసం మూడు రోజుల్లోగా కార్పొరేటర్లు, టౌన్ ప్లానింగ్, రెవిన్యూ, శానిటేషన్ విభాగాల అధికారులతో "అవగాహన సదస్సు"ను ఏర్పాటు చేయండి.మళ్లీ చెబుతున్నా. మా నుండి మీపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉండవు. స్వేచ్ఛగా పనిచేసుకోవచ్చు. నెలరోజుల్లో మున్సిపల్ ఆఫీసులో మార్పు రావాలి. కరీంనగర్ లో ప్రజలు ఇల్లు కట్టుకోవాలంటే చాలా సులువుగా అనుమతి వస్తుందనే నమ్మకం ప్రజలకు రావాలి. ఆచరణలో చూపాలి. కరీంనగర్ స్ఫూర్తితో రాష్ట్రమంతటా టౌన్ ప్లానింగ్ విభాగంలో మార్పులకు నాంది పలకాలి. ఆ విధంగా మీరు పనిచేసి చూపండి.కరీంనగర్ కు ఐకానిక్ గా ఉండే ప్రాజెక్టులు ఏమైనా ఉంటే చెప్పండి. వాటి అమలు కోసం, నిధుల కోసం నేను ప్రయత్నిస్తా. పెద్ద ఎత్తున సీఎస్సార్ ఫండ్స్ తీసుకొస్తా. అతి త్వరలోనే "అటల్ క్యాంటీన్" లను ఏర్పాటు చేసి ఆసుపత్రులు, మార్కెట్ కూడళ్లలో పేదలకు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని కడుపు నిండా పెట్టేలా చర్యలు తీసుకుంటా.



# ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దురాక్రమణ దాడిని ఖండించండి..

**- ఇజ్రాయెల్, అమెరికాతో భారత్ దౌత్య, వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవాలి..**

**- జూపాక శ్రీనివాస్ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి.**



**గోదావరిఖని,మార్చి02(పిసిడబ్ల్యూ న్యూస్):** పశ్చిమ ఆసియాపై, ఆయిల్ పై ఆధిపత్యం కోసమే ఇరాన్పై అమెరికా, ఇజ్రాయెల్ దురాక్రమణ దాడులకు, యుద్ధానికి దిగింది. ఇది అత్యంత హేయమైన, అన్యాయమైన చర్య. ప్రపంచ ఆధిపత్య ధోరణి. విధానం.ఇరాన్ అధ్యక్షుడు ఖుమేనీని 30 అధునాతన అయిల్ బాంబులతో హత్య చేసినట్లు తెలుస్తోంది. నిన్న వెనుజుల అధ్యక్షుడు మదురోనీ ఎత్తుక పోయి ఆ దేశాన్ని అదుపులోకి తెచ్చుకున్నారు. మొన్న గాజానీ మరుభూమిగా మార్చారు. ఇవ్వాళ ఇరాన్ పై ఉన్మాద దురాక్రమణకు పూనుకున్నారు.ప్రపంచ వనరులు కొల్లగొట్టడానికి, ప్రపంచ వాణిజ్య, రాజకీయ, ఆర్థిక ఆధిపత్యం కోసం అమెరికా, దాని పెంపుడు జంతువు ఇజ్రాయెల్ మారణహోమం చేస్తూ రక్తపు చేతులతో మానవత్వం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నది. ఇది నగ్నమైన అమానుష చర్యలకు దొంగ ముసుగు మాత్రమే.నరహంతకులతో చేతులు కలుపుకొని, ఆలింగనాలూ భారత దేశం చేసుకోవడమే రక్త, నరహంతక చర్యలలో భాగం కావడమే. మోడీ, ట్రంప్, నేతన్యాహు త్రయం జాతి విద్వేష విధానాలలో, నరహంతక చర్యలలో అన్నతమ్ములుగా మారారు. ఇది మన దేశ పౌర సమాజంకు అవమానం.ఇరాన్ పై దాడిని జజూఅఎశ్రీ మాస్ లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. వెంటనే యుద్ధం ఆపాలని డిమాండ్ చేస్తున్నది. అంతర్జాతీయ సంస్థలు జోక్యం చేసుకోవాలని కోరుతున్నది.నరహంతకులతో మోడీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలన్నీటిని రద్దు చేసుకోవాలని కోరుతున్నది. భారత్ లాంటి అలీన దేశం.. ప్రజాస్వామిక దేశం ప్రపంచ హంతకులతో చేతులు కలుపుకోవడం దేశ ప్రజలందరినీ అవమానించడమే. విప్లవ శ్రేణులు, మేధావులంతా ఈ పాశవిక చర్యలు ఖండించాలని, సామ్రాజ్యవాద అమెరికా అనుసరిస్తున్న విధానాలను భారతదేశ పాలకుల సైతం వ్యతిరేకించాలని డిమాండ్ చేస్తున్నాము.



# కమనీయంగా శ్రీవారి కళ్యాణోత్సవం..



**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** పుంగనూరు పట్టణంలోని కోనేటి వద్ద వెలిసి ఉండు శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో టిటిడి వారి ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు.ఈ సందర్భంగా సోమవారం ఉదయం శ్రీవారి కళ్యాణోత్సవంను అర్చకులు శాస్త్రోక్తంగా, వైభవోపేతంగా నిర్వహించారని ఆయన తెలిపారు. కల్యాణోత్సవంలో తితిదే డిప్యూటీ ఈఓ శ్రీమతి వి.ఆర్.శాంతి, ఎలక్ట్రికల్ ఏఈ బాలకృష్ణ మూర్తి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు..

# ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలవాలి : రాహుల్ గాంధీ

**వికారాబాద్‌లో ముగిసిన ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం**

**రాహుల్ గాంధీని కుటుంబ సమేతంగా కలిసిన వరంగల్ డీసీసీ అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్**

**వరంగల్, మార్చి02(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల పది రోజుల శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. వికారాబాద్‌లోని హరిత వ్యాలీ రిసార్ట్స్‌లో ఫిబ్రవరి 21 నుండి మార్చి 2 వరకు జరిగిన ఈ శిబిర ముగింపు కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేత, పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్ తన కుటుంబ సభ్యులతో కలిసి రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. రాహుల్ గాంధీ వారితో ప్రత్యేకంగా ముచ్చటించి, పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని అడిగి తెలుసుకున్నారు. **శిక్షణ శిబిరంలో రాహుల్ గాంధీ సందేశం** డీసీసీ అధ్యక్షులను ఉద్దేశించి రాహుల్ గాంధీ మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు. "డీసీసీ అధ్యక్ష పదవి అనేది కేవలం అధికారం కాదు, అదొక గొప్ప బాధ్యత. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య మీరు వారధిలా ఉండాలి. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారంలో ముందుండాలి," అని ఆయన దిశానిర్దేశం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అండగా నిలవాలన్నారు. రాజ్యాంగ విలువులకు భంగం కలిగించే శక్తులను ఎప్పటికప్పుడు ఖండించాలన్నారు. అహింస, ప్రేమతో కూడిన గాంధేయ మార్గంలో నడుస్తూ ప్రజల మనసు గెలవాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం రక్తం చిందించే ప్రతి కార్యకర్తకు అధ్యక్షులు అండగా ఉండాలి. వారితో ప్రేమగా మెలుగుతూ సమన్వయం చేసుకోవాలని, మహిళల అభివృద్ధికి పాటుపడుతూ, వారికి పార్టీలోనూ, సమాజంలోనూ తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల పాల్గొన్నారు. అలాగే ఏఐసీసీ ఇన్చార్జిలు మీనాక్షి నటరాజన్, మాణిక్యం ఠాగూర్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, సచిన్ సావంత్, పలక్ వర్మతో పాటు రెండు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారు



**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** పుంగనూరు పట్టణంలోని కోనేటి వద్ద వెలిసి ఉండు శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో టిటిడి వారి ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ నిర్వహిస్తున్నామని ఆలయ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం వార్షిక బ్రహ్మోత్సవములులో భాగంగా ఏడవ రోజు స్వామి వారు గజ వాహనం పై కళ్యాణ వెంకన్నగా పుర వీధులలో తిరుగుతూ భక్తులను కటాక్షించారు. వాహనం ముందు మంగళ వాయిద్యాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి భజన కోలాట బృందాలు భజన, కోలాటాలు, డప్పు వాయిద్యాలు, నడుమ స్వామి వారు ఊరేగారు. పుర వాసులు అడుగడుగున స్వామి వారికి కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది భక్తాదులు పాల్గొన్నారు.

# నూతన ఆరోగ్య పథకం ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలి










**రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుల డిమాండ్**

**ఖమ్మం, మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** పెన్షనర్లు, ఉద్యోగులకు ఎంతో కీలకమైన నూతన ఆరోగ్య పథకం (ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్)కు సంబంధించిన విధి విధానాలు, ఉత్తర్వులను తక్షణమే విడుదల చేసి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. సుబ్బయ్య, టి. వేణు గోపాల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం నగరంలోని పెన్షనర్స్ భవన్‌లో సోమవారం నిర్వహించిన నగర శాఖల జనరల్ బాడీ సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఇటీవల ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన దుబ్బాకుల శ్రీనివాసరావుకు నిర్వహించిన అభినందన సభలో వారు మాట్లాడుతూ, నూతన ఆరోగ్య పథకంలో భాగంగా వైద్య చికిత్సకు సంబంధించిన నిబంధనలను వెంటనే అమలు చేసి, అవసరమైన జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెన్షనర్ల పెండింగ్ బకాయిల చెల్లింపుల కోసం ప్రస్తుతం ప్రభుత్వం ప్రతినెలా విడుదల చేస్తున్న రూ.700 కోట్లు సరిపోవడం లేదని పేర్కొన్నారు. దీర్ఘకాలిక బకాయిలను వేగంగా పరిష్కరించాలంటే ప్రతినెల కనీసం రూ.1,500 కోట్లు విడుదల చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మార్చి నెలలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో, పెన్షనర్ల ఆందోళనకు తావు లేకుండా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కమిటీతో పాటు ఖమ్మం నగర నాలుగు శాఖల బాధ్యులు కలిసి దుబాకుల వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..., రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తనపై ఉంచిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా శాఖ నాయకులు ఆర్. వెంకట నారాయణ, ఎస్. పూర్ణచందర్రావు, పి. సాంబశివరావు, ఆర్. దుర్గాదేవి, టి. జనార్దన్, కాజా మొయినుద్దీన్, ఉపేందర్ రావ్, జానయ్యలతో పాటు ఖమ్మం నగర శాఖల నాయకులు పి. బసవరావు, యు. వెంకటేశ్వర్లు, సి.హెచ్. బాబు, ఆదినారాయణ, నాగేశ్వరరావు, రాధాకృష్ణ, రమేష్, రమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజంపేట పార్లమెంట్ సెక్రెటరీగా ప్రమాణస్వీకారం చేసిన పర్వీన్




**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: మార్చ్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగునూరు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకురాలు పర్వీన్ రాజంపేట పార్లమెంట్ టిడిపి సెక్రటరీగా సోమవారం మదనపల్లి పట్టణంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆమె మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీనీ అత్యధిక స్థానాల్లో గెలిపించడమే తమ లక్ష్యం అన్నారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు తక్షణ మౌలిక వసతులు కల్పించాలి

**- స్పెషల్ క్లాసుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి ఆపాలి: యుఎస్ఎఫ్ఐ- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం**

**ఖమ్మం, మార్చి 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు తక్షణమే కల్పించాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలపై సంఘం నిర్వహించిన సర్వేలో బయటపడిన లోపాలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికు వినతిపత్రం సమర్పించిన సందర్భంగా బొట్ల సాగర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పాఠశాల భవనాల అభివృద్ధి, తాగునీటి సౌకర్యం, శుభ్రమైన మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, బెంచీలు, పాఠ్యపుస్తకాలు, డిజిటల్ క్లాస్‌రూమ్స్ వంటి ప్రాథమిక అవసరాలు ప్రతి పాఠశాలలో సమృద్ధిగా ఉండేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేసి, ప్రతి పాఠశాలలో సరిపడా బోధనా సిబ్బంది నియమించాలని సూచించారు. ముఖ్యంగా జిల్లాలో అనేక పాఠశాలలో పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇదిలా ఉండగా, జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలలో ప్రత్యేకించి శ్రీచైతన్య కళాశాలలో 10వ తరగతి విద్యార్థులపై అధిక సమయపట్టిక పేరుతో తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని ఆరోపించారు. ఉదయం ప్రారంభమై రాత్రి 9 గంటల వరకు కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయన్నారు. అధిక ఒత్తిడి కారణంగా ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య అనేది కేవలం మార్కుల సాధనకే పరిమితం కాకుండా, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడే విధంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులను అనవసర ఒత్తిడికి గురి చేస్తున్న సంస్థలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని యుఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది.







# ఏటూరునాగారంలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

**ఎమ్మార్వో కార్యాలయ నిర్లక్ష్యంతో ప్రభుత్వ నిబంధనలకు తూట్లు**



**ఏటూరునాగారం, మార్చి02(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ముఖ్యంగా ఎమ్మార్వో కార్యాలయ నిర్లక్ష్యం కారణంగా అక్రమ ఇసుక తరలింపు యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్రభుత్వం ఇందిరమ్మ పథకం పేరుతో ఇళ్లు నిర్మించుకునే పేదలకు ఇసుక తరలింపునకు అనుమతులు ఇస్తున్నా, అదే పేర్లతో పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుకను ఇటుక ప్లాంట్లకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందిరమ్మ లబ్ధిదారుల పేర్లపై దరఖాస్తులు వేయించి, ఆ అనుమతులను దుర్వినియోగం చేస్తూ ట్రాక్టర్ల ద్వారా రోజుకు పలు సార్లు ఇసుకను తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం జరుగుతుండగా, పర్యావరణానికి కూడా తీవ్ర హాని కలుగుతోంది. నదీ గర్భం దెబ్బతిని, భూగర్భ జలాల స్థాయి తగ్గే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మార్వో కార్యాలయ అధికారులు ఈ అక్రమాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరిస్తున్నారా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, సరైన చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుని, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ‘విశ్వనాథ్ అండ్ సన్స్’

## సూర్య-వెంకీ అట్లూరి చిత్రానికి టైటిల్ ఖరారు.. ఆకట్టుకుంటున్న ఫస్ట్ లుక్

ఈ ఏడాది జులైలో సినిమా విడుదల చేసేందుకు సన్నాహాలు కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రానికి సంబంధించిన కీలక అప్డేట్ వచ్చేసింది. సూర్య 46వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం అధికారికంగా విడుదల చేసింది. ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.

విడుదలైన ఫస్ట్ లుక్‌లో సూర్య కళ్లద్దాలు ధరించి, ఓ చిన్నారిని ఎత్తుకుని ఎంతో ప్రేమగా కనిపిస్తున్నారు. బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో ఆయన లుక్ పరిపక్వంగా, భావోద్వేగభరితంగా ఉంది. సింపుల్‌గా ఉన్నప్పటికీ ఎమోషనల్ టచ్‌తో ఉన్న ఈ పోస్టర్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ లుక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఈ మూవీలో ‘ప్రేమలు’ చిత్రంతో పాప్యులర్ అయిన మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే, ఈ ప్రాజెక్ట్‌లో రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్, భవాని శ్రే వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. కుటుంబ నేపథ్యం, బలమైన భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలు కలగలిపి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ‘లక్కీ భాస్కర్’ వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తుండటంతో ఈ సినిమాపై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని జులైలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




# ‘ఉస్తాద్ భగత్ సింగ్‘ రీమేక్ కాదు.. అసలు నిజం చెప్పిన హరీశ్ శంకర్

పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా వస్తున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్‘ చిత్రంపై గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారానికి దర్శకుడు హరీశ్ శంకర్ ఫుల్‌స్టాప్ పెట్టారు. ఈ సినిమా తమిళ బ్లాక్‌బస్టర్ ‘తెరి‘కి రీమేక్ అంటూ వస్తున్న ఊహాగానాలపై ఆయన ఘాటుగా స్పందించారు. తన సినిమా రీమేక్ కాదని స్పష్టం చేయడమే కాకుండా అసలు ‘తెరి‘ చిత్రంలోనే తన ‘గబ్బర్ సింగ్‘ సినిమాలోని ఓ సన్నివేశాన్ని కాపీ చేశారని ఆరోపించారు.

తాజాగా ఓ ప్రమోషనల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన హరీశ్ శంకర్, తాను రీమేక్ చేస్తే నిజాయతీగా ఒప్పుకుంటానని స్పష్టం చేశారు. “గబ్బర్ సింగ్ చిత్రానికి నేను ‘మాటలు, మార్పులు, దర్శకత్వం‘ అని టైటిల్ కార్డ్ వేసుకున్నాను. బహుశా తెలుగు ఇండస్ట్రీలో అలా వేసుకున్న మొదటి వ్యక్తిని నేనే. ఆ టైటిల్ కార్డు చూసి రాజమౌళి గారు ఫోన్ చేసి మెచ్చుకున్నారు. అలాంటిది, ‘ఉస్తాద్ భగత్ సింగ్‘ నిజంగా రీమేక్ అయితే ‘కథ, మాటలు, దర్శకత్వం‘ అని ఎందుకు వేసుకుంటాను?“ అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

రీమేక్ ఆరోపణలను తిప్పికొడుతూ ఆయన ఓ ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టారు. “గబ్బర్ సింగ్‌లో నేను పెట్టిన అంత్యాక్షరి ఎపిసోడ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ‘తెరి‘లో రౌడీలతో రైమ్స్ చెప్పించారు. నా సినిమాలోని సీన్‌ను వాళ్లు వాడుకుంటే, ఇప్పుడు ఆ సినిమానే నేను రీమేక్ చేస్తున్నానని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం?“ అంటూ హరీశ్ శంకర్ అసహనం వ్యక్తం చేశారు. ఏ పోలీస్ కథలో అయినా హీరో సంఘ విద్రోహ శక్తులపై పోరాడతాడని, ‘తెరి‘, ‘టెంపర్‘ వంటి సినిమాలన్నీ ఆ కోవకే చెందుతాయని అన్నారు.

పవన్ కల్యాణ్ కెరీర్‌లో ‘గబ్బర్ సింగ్‘ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఆ సినిమా తర్వాత ఈ కాంబోలో వస్తున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్‘పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ



మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలకు అద్భుతమైన స్పందన రాగా, సినిమా ఈ నెల 26న విడుదలకు సిద్ధమవుతోంది.



# బ్లూ వెలుగుల్లో రకుల్ హీట్!

సాధారణంగా ప్రతి ఒక్కరి జీవితంలో ఏదో ఒక అద్భుతమైన క్షణం జరిగే ఉంటుంది. అయితే ఇప్పుడు తన జీవితంలో ఆ మధురమైన క్షణం ఈరోజు వచ్చింది అంటూ రకుల్ ప్రీత్ సింగ్ తన ఇన్స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసుకున్న ఫోటోలు అభిమానులను ఆనందానికి గురి చేస్తున్నాయి. అసలు విషయంలోకి వెళ్తే.. ఇటీవల ఈమె నటించిన ‘దేదే ప్యార్ దే 2‘ సినిమాకి గాను బెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే తాజాగా జీ సినీ అవార్డ్స్ 2026 వేడుకల్లో భాగంగా రకుల్ ప్రీత్ సింగ్ అవార్డు అందుకున్న క్షణాలకు సంబంధించిన ఫోటోలను తన ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. ౹ాశ్రీంశీ ఇందులో బ్లూ గ్లిటర్తో డిజైన్ చేసిన ఒక అందమైన డ్రెస్ ధరించి తన అందాలతో వేడుకకే స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది ఈ ముద్దుగుమ్మ. ఫ్రంట్ డీప్ వీ నెక్ తో డిజైన్ చేసిన ఈ డ్రెస్ ఈమె అందాలను రెట్టింపు చేసింది. అసలే వైట్ స్కిన్ టోన్ దీనికి తగ్గట్టు బ్లూ డ్రెస్ ఇక ఈమె అందాలను ఏ విధంగా మార్చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొత్తానికైతే బ్లూ డ్రెస్ లో జీ సినీ అవార్డ్స్ వేడుకల్లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది రకుల్ ప్రీత్ సింగ్. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇకపోతే రకుల్ ప్రీత్ సింగ్ ఈ విషయాన్ని అభిమానులతో పంచుకుంటూనే మరొకవైపు ఇలా క్యాప్షన్ జోడించింది. “చాలా సంవత్సరాల తర్వాత మొదటిసారి జీ సినీ అవార్డును అందుకోవడం ..అందులోనూ దేదే ప్యార్ దే 2 చిత్రానికి బెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ విభాగంలో అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా కొన్ని ప్రయాణాలు ఎప్పుడు మీతోనే ఉంటాయి. అది ప్రేమ, నవ్వు ఇలా ఎప్పటికీ గుర్తించుకునే జ్ఞాపకాలతో ఆ ప్రయాణం నిండి ఉంటుంది. నాకు మద్దతుగా నిలిచిన అజయ్ దేవగన్, యాక్టర్ మాధవన్, చిత్ర బృందానికి నేను ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా నన్ను నమ్మి ఆదరిస్తున్న అభిమానులకు ఎప్పటికీ రుణపడి ఉంటాను“ అంటూ రకుల్ ప్రీత్ సింగ్ క్యాప్షన్ జోడించింది.



# ‘దండోరా‘ సినిమా ఫెయిల్ కావడానికి కారణం ఇదే: శివాజీ

నటుడు శివాజీ ప్రధాన పాత్రలో నటించిన ‘దండోరా‘ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో సినిమా వైఫల్యానికి గల కారణాలను శివాజీ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో విశ్లేషించారు. సినిమా విడుదల సమయం (రిలీజ్ డేట్) సరిగ్గా లేకపోవడమే ప్రధాన తప్పిదమని ఆయన అభిప్రాయపడ్డారు. డిసెంబర్ 25న సినిమాను విడుదల చేయాలని భావించినప్పటికీ, సెన్సార్ ప్రక్రియలో జాప్యం జరిగిందని.. 24వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు క్లియరెన్స్ రాకపోవడంతో థియేటర్ల యజమానులు రిస్క్ తీసుకోలేకపోయారని ఆయన వెల్లడించారు. సెన్సార్ అవుతుందో లేదో అన్న అనిశ్చితి వల్ల ఎవరూ థియేటర్లు ఇవ్వడానికి ముందుకు రాలేదని, అది సినిమాపై తీవ్ర ప్రభావం చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం విడుదల సమయమే కాకుండా, సినిమా టైటిల్ కూడా మైనస్ అయిందని శివాజీ పేర్కొన్నారు. ‘దండోరా‘ అనే పేరు వినగానే ఇది ఒక కమ్యూనిస్టు భావజాలం ఉన్న సినిమా అని ప్రేక్షకులు భావించారని చెప్పారు. అందుకే, ఆ టైటిల్ మార్చాలని తాను నెల రోజుల పాటు ప్రయత్నించానని, కానీ కుదరలేదని చెప్పారు. హైదరాబాద్ వంటి నగరాల్లో కూడా సినిమాకు సరైన ప్రైమ్ టైమ్ షోలు దక్కలేదని.. కేవలం సాయంత్రం 4 గంటలకు, రాత్రి 10 గంటలకు మాత్రమే షోలు ఇచ్చారని తెలిపారు. అయినప్పటికీ, ఉన్న తక్కువ స్క్రీన్లతోనే నైజాం ఏరియాలో కోటి రూపాయల కలెక్షన్లను రాబట్టడం విశేషమని, ఒకవేళ సరైన థియేటర్లు మరియు షోలు లభించి ఉంటే సినిమా భారీ విజయాన్ని నమోదు చేసేదని శివాజీ స్పష్టం చేశారు. కంటెంట్ పరంగా మెప్పించినా... సాంకేతిక, పంపిణీ పరంగా జరిగిన లోపాల వల్లే ‘దండోరా‘ వెనుకబడిందని ఆయన వివరించారు.

# స్పిరిట్ నుంచి ప్రకాశ్ రాజ్ ఔట్



గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ క్రేజీ ప్రాజెక్ట్ స్పిరిట్. యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే మొదలైంది. కాగా ఈ చిత్రంలో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే స్పిరిట్ షూటింగ్‌ను తాను ఇంకా మొదలుపెట్టలేదని క్లారిటీ కూడా ఇచ్చాడు ప్రకాశ్ రాజ్. ఇదిలా ఉంటే మరోవైపు ఎవరూ ఊహించని విధంగా బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ లుక్‌ను షేర్ చేశారు. ఈ నేపథ్యంలో తాజా పుకారు ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. మేకర్స్ ప్రకాశ్ రాజ్ పేరు ట్యాగ్ చేయకపోయే సరికి దాదాపు స్పిరిట్ నుంచి తప్పుకున్నట్టేనంటూ కొత్త వార్త తెరపైకి వచ్చింది. రాజకీయాలకు సంబంధించిన కామెంట్స్ చేయడం సినిమాపై ప్రభావం చూపించే అవకాశం ఉందని సందీప్ రెడ్డి వంగా ప్రకాశ్ రాజ్‌కు చెప్పాడట. అయితే కామెంట్స్ చేయడం గురించి ప్రకాశ్ రాజ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి ఎలాంటి హామీనివ్వకపోవడంతో ఈ సినిమా నుంచి ప్రకాశ్ రాజ్ తప్పించి వివేక్ ఒబెరాయ్‌ను తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. కానీ ఈ వార్తలపై మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. హై ఓల్టేజీ కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది.

# సొంతూరు తుమ్మెన్‌పేట్‌లో విరోష్ దంపుతులు

వివాహానంతరం టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ-రష్మిక స్వగ్రామానికి రావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మెన్‌పేట గ్రామం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. నూతన దంపతుల రాకతో గ్రామంలో ఉత్సాహం వెల్లివిరిసింది. పెళ్లి తర్వాతి సంప్రదాయ ఆచారాల్లో భాగంగా ఈ జంట డప్పు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా గ్రామంలోకి ప్రవేశించారు. అనంతరం తులసిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సత్యనారాయణ స్వామి వ్రతంలో ఆసీనులై, కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో



తరలివచ్చారు. సుమారు 400 మందికి పైగా ఆహ్వానితులు హాజరైనట్లు సమాచారం. విజయ్-రష్మికలను ఒక్కసారి చూడాలనే ఆశతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా చేరుకున్నారు. తమ అభిమాన నటులు సొంత ఊరిలో ఇంత సాదాసీదాగా, సంప్రదాయ బద్ధంగా వేడుకలు జరుపుకోవడం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని వీధులన్నీ జనంతో కళకళలాడాయి. స్టార్ కపుల్ రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వారి నివాసం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ముందస్తు పాసులు ఉన్న వారినే లోపలికి అనుమతించారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ నేతృత్వంలో సీఐ నాగరాజు, బల్మూరు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. టాలీవుడ్‌లో సెన్సేషన్‌గా నిలిచిన ఈ జంట తమ స్వగ్రామంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోలు, ఫోటోలు అభిమానుల్లో విపరీతంగా షేర్ అవుతూ ట్రెండ్ అవుతున్నాయి.